ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 31 జూలై 2024 | 5


ఐదేళ్ల ఇల్లు : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వెలుగుబందలో నిర్మించిన అగ్గిపెట్టె వంటి ఇల్లు

తగ్గని వరద జోరు : రాజమహేంద్రవరం రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద గోదావరి ఉధృతి

- వివరాలు 7లో



గోదారెటు!


గోష్పాదక్షేత్రంలో మిగిలిన బురద

- తగ్గుతూ.. పెరుగుతున్న గోదావరి
- ధవళేశ్వరం వద్ద తగ్గని ఉధృతి
- కొనసాగుతున్న మొదటి హెచ్చరిక
- భద్రాచలం వద్ద మళ్లీ పెరుగుదల
- ఘాట్లలో పేరుకుపోయిన బురద

రాజమహేంద్రవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు : వరద వదల్లేదు.. ఇంకా కొనసాగుతూనే ఉంది. పైకి తగ్గినట్టు కనిపిస్తున్నా ప్రవాహ ఉధృతి మాత్రం అలాగే ఉంది. నదీ పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గత 12 రోజులుగా అఖండ గోదావరి ఉప్పొంగి ప్రవహించింది. రికార్డు స్థాయిలో వరద పోటెత్తడంతో ఏటిగట్లను తాకుతూ ఎప్పుడు ఊర్లపై విరుచుకు పడదామా అన్నట్టు తీర ప్రాంత ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికి క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టాల మెట్లపై గోదావరి ఉధృతంగా సుడులు తిరుగుతూ ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. ప్రస్తుతం గోదావరి వరద దోబూచులాడుతోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద తగ్గుతూనే ఉంది.మంగళవారం ఉదయం 6 గంటలకు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. రాత్రి 12 గంటలకు బ్యారేజీ వద్ద నీటిమట్టం 12.50 అడుగులకు చేరింది. ఇది 11.75 అడుగులకు దిగితే మొదటి హెచ్చరిక ఉపసంహరించుకుంటారు. ప్రస్తుతం బ్యారేజీ నుంచి దిగువకు 11,05,869 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.ఇదిలా ఉండగా భద్రాచలం వద్ద స్వల్పంగా పెరుగుదల కనిపిస్తోంది.ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక మాత్రమే కొనసాగుతోంది. వాస్తవానికి సోమవారం రాత్రి వరకూ భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గుతూ వచ్చింది. అయితే మంగళవారం ఉదయం 7 గంటలకు ఒక్కసారిగా పదిపాయింట్లు పెరిగి నీటిమట్టం 42.90 అడుగులకు చేరింది.అక్కడ నుంచి నెమ్మదిగా పెరుగుతూ రాత్రి 12 గంటలకు 43.80 అడుగులకు చేరింది. దీంతో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతి కనిపి స్తుంది. ఇదిలా ఉం డగా కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వరద తగ్గుముఖం పట్టడంతో బురదమయమైంది.ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదావరికి వరద తగ్గింది.దీంతో గోష్పద క్షేత్రంలోని ఆలయాలు వరద ప్రవాహం నుంచి బయటపడ్డాయి.వరద ప్రవాహంతో గోష్పదక్షేత్రం అంతా బురదమయంగా మారడంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు. బురదలో ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. బురదను త్వరితగతిన తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

ఏటిగట్లు పటిష్టం చేయాలని సీపీఎం వినతి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 30 : గోదావరి ఏటిగట్లను పటిష్టం చేయాలని సీపీఎం జిల్లా బృందం కలెక్టర్‌ను కోరింది.ఈ మేరకు కలెక్టర్‌కు ఒక వినతిపత్రం అందజేసినట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తెలిపారు. ప్రమాదకరస్థాయిలో గోదావరి ప్రవహిస్తున్న సమయంలో ధవళేశ్వరం నుంచి పురుషోత్తపట్నం మధ్య బలహీనంగా ఉన్న ఏటిగట్లను పటిష్టం చేయాల్సి ఉందని తెలిపారు. ప్రధానంగా కాతేరు, తొర్రేడు, బొబ్బిల్లంక, మునికూడలి, ముగ్గళ్ల, సీతానగరం ప్రాంతాల్లోని గట్లకు ప్రమాదం ఉందని ఇరిగేషన్ అధికారులు గతంలోనే నివేదికలు ఇచ్చారని తెలిపారు. సీతానగరం మండలంలో జరిగిన అక్రమ ఇసుక తవ్వకాల వల్ల నీటి ప్రవాహం తీరుమారి ఏటిగట్లు దెబ్బతిన్నాయని వివరించారు. గతంలో ఏటిగట్లను పటిష్టపరచడానికి ఇరిగేషన్ అధికారులు రూ.60 కోట్ల బడ్జెట్‌తో పనులకు నివేదికలు ఇచ్చారని, కానీ జగన్మోహనరెడ్డి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు జరగలేదని తెలిపారు. మరిన్ని సమస్యలపై కూడా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని పేర్కొన్నారు. సీపీఎం బృందంలో రాజమహేంద్రవరం నగర కార్యదర్శి పవన్, నాయకులు సుందరబాబు, కె.రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

మంత్రిగారొచ్చారు.. సమస్య చూశారు!


కాపవరం వంతెన పరిశీలిస్తున్న మంత్రి

పెరవలి, జూలై 30 : హంగూ లేదూ.. ఆర్భాటం లేదు..ముందస్తు షెడ్యూలు లేదు.. మంత్రి గారు వచ్చేశారు..ఇది విన్న గ్రామస్తులంతా ఆశ్చర్యపోయారు. ఎందుకొచ్చారోనంటూ వెంటనే మంత్రి వద్దకు పరుగులు తీశారు. ఈ సంఘటన మంగళవారం ఉదయం పెరవలి మండలం కాపవరం గ్రామంలో జరిగింది. గతంలో తమ గ్రామం వద్ద గల కాలిబాట వంతెన శిథిలావస్థకు చేరిందని..మరమ్మతులు చేయించాలంటూ గ్రామస్థులు అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయం అధికారులు మంత్రిదృష్టికి తీసుకువచ్చారు.అంతే అప్పటికప్పుడు బయలుదేరి కాపవరం వచ్చారు.వంతెన అంతా పరిశీలించారు. అయితే గ్రామస్థులు తమకు పెద్ద వంతెన వేయాలని కోరారు. అది రావాలంటే పెద్ద బడ్జెట్ అని ఇరువైపులా రోడ్లు సక్రమంగా ఉండాలని అందువల్ల కాలువ అవతలి వైపు రోడ్డు పనులు ముందుగా చేయాలని అధికారులను ఆదేశించారు.కాపవరం కాలువగట్టు నుంచి తణుకు వెళ్లే పుంత రోడ్డును పక్కా రోడ్డుగా మార్చమని అప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఈ వంతెనకు మరమ్మతులు చేయిస్తామని భవిష్యత్తులో పెద్ద వంతెన విషయమై పరిశీలిస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కాపవరం గ్రామం నుంచి కాలువ అవతల గల పొలాలకు వెళ్లాలన్నా తణుకు తదితర చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లాలన్నా ఈ వంతెన ప్రధాన ఆధారం.

పేదింటి కలత తీరేను!



పేదలకు చంద్రబాబు వరం

- ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు
- గ్రామాల్లో 3 సెంట్లు స్థలం
- పట్టణాల్లో 2 సెంట్లు అందజేత
- కొత్త వారికే వర్తింపు
- మార్చిలో లబ్ధిదారుల గుర్తింపు
- ఏప్రిల్ నుంచి భూ సేకరణ
- గత లబ్ధిదార్లకూ ఆనందం
- ప్రస్తుత ఇళ్లు వేగవంతమే
- వెలుగుబందలో ఇళ్లు నిలిపివేత
- నాణ్యత లోపమే కారణం
- విచారణకు ఆదేశం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కూటమి వరమిచ్చింది.. జిల్లాలోని పేదోడి సొంతింటి కల తీరనుంది..సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పేదలకు తీపికబురు చెప్పింది. పింఛన్ల పంపిణీలో పేదవారి ముఖాన చిరునవ్వు చూసిన కూటమి ప్రభుత్వం తిరిగి అదే ఒరవడి కొనసాగిస్తూ పేదోడి సొంతింటి కల నెరవేర్చేందుకు ముందుకొచ్చింది. రెండు రోజులుగా గృహనిర్మాణ పథకంపై ఉన్నతాధికారులతో సమాలోచనలు జరిపి పేదల గృహనిర్మాణానికి రూ.4 లక్షలు వ్యయం చేసేందుకు నిర్ణయించడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కొక్క లబ్ధిదారుడికి గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు(144 చ.గ), పట్టణ పరిధిలో 2 సెంట్లు(96 చ.గ) చొప్పున ప్రభుత్వం స్థలాలు పంపిణీ చేయడమే గాక ఆ స్థలాల్లో రూ. 4 లక్షల వ్యయంతో ఇళ్ళు నిర్మించనున్నారు. గత ప్రభుత్వంలో స్థల కేటాయింపులు మాత్రమే జరిగి ఇంటి నిర్మాణాలకు నోచుకోని లబ్ధిదారులకు సైతం కొత్త గృహ నిర్మాణ పథకంలో రూ. 4 లక్షలు వెచ్చించి ఇంటి నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మేరకు మార్గదర్శకాలు మరో రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం వెల్లడించనున్నట్టు గృహనిర్మాణ అధికారుల ద్వారా తెలిసింది.దీంతో పేద, మధ్యతరగతి ప్రజల్లో ఆనందం కనిపి స్తోంది.

గత వైసీపీలో అంతా మోసమే..

పేదలందరికీ ఇళ్ళు నిర్మిస్తాం అంటూ అదేదో సొంత జేబులోని సొమ్ముతో కట్టిస్తున్నట్టు కల్లబొల్లి కబుర్లతో కోట్ల మేర నిధులను స్వాహాచేసిన గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాయకులు నివ్వెరపోయే రీతిలో కూటమి ప్రభుత్వం చకచకా అడుగులు ముందుకేస్తుంది. గత వైసీపీ ప్రభుత్వంలో కేవలం ఒక్క సెంటు మాత్రమే.. అవి కూడా పనికిరాని స్థలాలు ఇచ్చి జగనన్న కాలనీలు అంటూ హడావుడి చేశారు. జిల్లాలో 68,074 ఇళ్లను కట్టిస్తానని.. దాని కోసం 321 లేఅవుట్లు వేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో సెంటున్నర, పట్టణ ప్రాంత లబ్ధిదారులకు సెంటు స్థలం కేటాయించిన సంగతి తెలిసిందే.అది కూడా ఊరికి దూరంగా.. పనికిరాని స్థలాలు కేటాయించారు.పల్లపు ప్రాంతాల్లో లేఅవుట్ వేస్తామని చెప్పి ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాలు కల్పించని సంగతి తెలిసిందే. పైగా ఇంటికి రూ.1 లక్షా 80 వేలే కేటాయించడం వల్ల చాలా మంది పేదలు ఇళ్ల నిర్మా ణానికి ముందుకు రాలేదు. ఏదో విధంగా కట్టుకున్న వాళ్లు అప్పుల పాలయ్యారు. అప్పటి పేదల కాలనీ పేరిట మొదలెట్టిన ఇళ్లు అధ్వానంగా మారి..దొంకలు కూడా పెరిగిన సంగతి తెలిసిందే. అంతేకాదు అర్బన్ ప్రాంతంలో సెంటు భూమిలో ఇల్లు కట్టిస్తానని..పట్టణ ప్రాంతంలోని లబ్ధిదార్లకు గ్రామాల్లో సెంటు కేటాయించి మోసం చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో మొదట 68,074 ఇళ్లు మంజూరయ్యాయని చెప్పి 65,075 ఇళ్లు మంజూరు చేశారు. అందులో 20,899 అసలు ఆరంభమే కాలేదు. కేవలం 24,563 పూర్తి చేసినా అక్కడ జనం నివసించే విధంగా సౌకర్యాలు లేవు. అంతేకాక ప్రజలను నేతలు కూడా మభ్యపెట్టారు. రాజమహేంద్రవరం అర్బన్ లబ్ధిదారులకు వెలుగుబందలో 11,783 స్థలాలు మాత్రమే మంజూరు చేశారు. ఆవభూముల కొనుగోలు చేసి సుమారు 40 వేల మందికి పనికిరాని స్థలాలు పంపిణీ చేశారు. ఈ భూములు నివాసయోగ్యం కావని లబ్ధిదారులు వెనుకంజ వేశారు. దీంతో ఇళ్ల స్థలాలు కేటాయించలేదు.గత వైసీపీ ప్రభుత్వంలో రాజమహేంద్రవరం లబ్ధిదార్లకు స్థలాలు చూపించకుండా కేవలం ఉత్తుత్తి పట్టాలు మాత్రమే పంచారు. ఎన్నికల ముందు ఎంత మంది దరఖాస్తు చేసుకుంటే అందరికీ భూమి లేకుండానే పట్టాలు ఇచ్చేశారు. చివరకు జిల్లాలోని జర్నలిస్ట్‌లందరికీ స్థలాలంటూ మోసం చేశారు. ఎద్ద ఎత్తున ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా ఓడిపోయింది.

వచ్చే మార్చి నుంచే అమలు..

టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావ డంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు ఇళ్ల స్థలాల కేటాయింపుపై దృష్టిపెట్టారు. కూటమి అధికారం చేపట్టి 50 రోజులైందో లేదో పేదింటి కల తీర్చే బాధ్యతను భుజానకెత్తుకున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయడంతో పాటు, కొత్తవారికి స్థలాలు ఇస్తామని ప్రకటించారు. వచ్చే మార్చిలోపు జిల్లాలోని లబ్ధిదార్లను గుర్తించి,భూమి కూడా సేకరించి, ఏప్రిల్ నుంచి పనులు ఆరంభించనున్నారు.పెండింగ్ బిల్లులు ఈలోపే ఇవ్వనున్నారు. గతంలో వైసీపీ ఆపేసిన లబ్ధిదారులకు కూడా బిల్లులు ఇవ్వనున్నారు.ప్రస్తుతం లేఅవుట్‌లలో అప్పోసప్పో చేసి చిన్న ఇళ్లు మొదలు పెట్టిన వారికి మాత్రం ఉన్న పథకం కిందే పూర్తి చేస్తారు. జర్నలిస్ట్‌లు, మధ్యతరగతి ప్రజలకు కూడా మంచి ఇళ్లు నిర్మించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. గత ప్రభుత్వ హయాంలో లబ్ధిపొందినవారు ఇప్పటికే ఇంటి నిర్మా ణాలకు చేసిన అప్పులతో సతమతమవుతుండగా.. కూటమి ప్రభుత్వం రూ.4 లక్షలతో ఇంటినిర్మాణాలు జరుగనుండడంతో దీలాపడుతున్నారు. మరో రెండు మూడు రోజుల్లో కేంద్ర ప్రభుత్వ అనుమతులతో మార్గదర్శకాలు వెలువరించనున్నారు.

కేంద్రం వాటాతో రూ.4 లక్షలు

కేంద్ర ప్రభుత్వం 2024-25 పీఎంఏవై-యు 2.0 పథకంలో భాగంగా కొత్తగా లబ్ధిదారులను ఎంపికచేయనున్నారు. ఇంటి నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ. 2.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ. 1.50 లక్షలు చొప్పున కేటాయించనుంది. ఒక వేళ రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.1.50 లక్షలు పూర్తిగా విడుదల కాకపోతే రూ. 1.20 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం భరించి మిగిలిన రూ.30 వేలు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా విడుదల చేసేందుకు సమాలోచనలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్ళ పథకానికి ఒక్క రూపాయి సొంతంగా (పట్టణాల్లో రూ.30 వేలు మినహా) కేటా యించకుండా ఐదేళ్ల పదవీకాలం పూర్తిచేసింది. ఈ నేపథ్యంలో తాజాగా కేంద్రప్రభుత్వం గృహ నిర్మాణ పథకం మార్గదర్శకాలను పూర్తిగా మార్పులు చేసింది. అంతే కాకుండా గృహ నిర్మాణ లక్ష్యాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని నిర్దేశించడంతో అందుకు కూటమి ప్రభుత్వం కూడా సరేనన్నట్లు సమాచారం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కేంద్ర బృందాలతో రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో సర్వే జరిపించినట్టు తెలిసింది.

వెలుగుబందలో ఇళ్ల నిర్మాణం నిలిపివేత

వెలుగుబందలో గత ప్రభుత్వం 11771 ఇళ్లను మంజూరు చేయగా.. అందులో కొంత మంది సొంతంగా కొంత డబ్బు వేసుకుని ఇళ్లు కట్టుకోవడానికి ముందుకువచ్చారు. 3396 మంది తమకు ఇళ్లు కట్టి ఇవ్వాలని, తాము పెట్టుబడి పెట్టలేమని చెప్పడంతో కొద్దిరోజులు ఇక్కడ పనులు చేపట్టలేదు.ఎన్నికల ముందు ఏడాది హడావిడిగా జెవిఎస్ఆర్, ఎంఆర్ సంస్థలతో పాటు స్థానికంగా కొందరికి కాంట్రాక్టు ఇచ్చి కేవలం రూ.1.80 లక్షలకే ఇంటిని నిర్మించేటట్టు ఒప్పందం పెట్టుకున్నారు. వీరు కేవలం నిబంధనలు పాటించకుండా అగ్గిపెట్టెలకంటే చిన్నవిగా ఇళ్లు కట్టారు. దీంతో ప్రభుత్వం ఇటీవల విచారణ చేయించింది. లోపాలు గుర్తించడంతో ఈ ఇళ్ల పనులు తక్షణం ఆపేయాలని ఆదేశాలివ్వడం గమనార్హం.

హెల్మెట్ ధరించకపోతే నేరం : పీడీజే

రాజమహేంద్రవరం,జూలై30(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుండా వాహనం నడపడం ప్రమాదకరమే కాకుండా శిక్షార్హమైన నేరమని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత హితవు పలికారు.డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కోర్టు ప్రాం గణం నుంచి లాలాచెరువు వరకూ హెల్మెట్ ధరించడంపై అవగాహన ర్యాలీ చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో హెల్మెట్లను సాధారణ ప్రజలకు ఉచితంగా అందించే కార్యక్రమానికి రూపకల్పన చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే జిల్లాలోని కొన్ని పరిశ్రమలను కోరగా సానుకూలంగా స్పందించాయన్నారు. హెల్మెట్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు చేపడతామని జిల్లా రవాణా అధికారి కేవీ కృష్ణారావు పేర్కొన్నారు.కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు, న్యాయమూర్తులు, డీఆర్‌వో జె.నరసింహులు,అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) రాజశేఖర్‌రాజు పాల్గొన్నారు.


హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న పీడీజే గంధం సునీత, న్యాయమూర్తులు, అధికారులు

బియ్యం దుకాణాలపై కలెక్టర్ కొరడా

విస్తృతంగా తనిఖీలు.. కేసులు నమోదు

'ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్'



రాజమహేంద్రవరం,జూలై30 (ఆంధ్రజ్యోతి): బియ్యం విక్రయ దుకాణాల్లో అవకతవకలపై కలెక్టర్ పి.ప్రశాంతి కొరడా ఝళిపించారు.బియ్యం ధరలు అమాంతం పెరిగిపోవడం,వ్యాపారుల మాయాజాలంపై 'బియ్యమూ వదల్లే- గత ఐదేళ్లా బియ్యం ధరలు దంచుడే'అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై స్పందించారు. తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో పౌర సర ఫరాల శాఖ అసిస్టెంట్ సప్లయిస్ ఆఫీసర్ నాగాంజనేయులు,తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ శామ్యూల్ రాజు రంగంలోకి దిగారు. జాంపేటలోని శ్రీ వెంకటేశ్వర రైస్ స్టోర్స్, సీతం పేటలోని విజయలక్ష్మి రైస్ స్టోర్స్, రామకృష్ణ రైస్ స్టోర్(బాలయ్య బియ్యం కొట్టు),అరిగెల బాబు నాగేంద్ర ప్రసాద్ రైస్ స్టోర్‌లలో తనిఖీలు చేశారు. బస్తాలో 26 కిలోలకు బదులు 25 కిలోలు ఉండడం, తక్కెడలో తేడా, కొన్ని బస్తాలపై ఎంఆర్పీ, తయారీ నెల, 5 కిలోల బియ్యం బస్తాపై ధర లేకపోవడం తదితర అవకత వకలు గుర్తించి కేసులు నమోదు చేశారు.సోదాలు నిరంతరాయం కొన సాగుతాయని అధికారులు తెలిపారు.నిబంధనలు ఉల్లంఘిస్తే కేసుల తప్పవన్నారు.


రాజమహేంద్రవరంలో అన్న కేంటిన్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

ఆగస్టు 15న అన్న కేంటిన్లు ప్రారంభం

రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 30 : పేదవాడి ఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తొలి దశలో ఆగస్టు 15న రాజమహేంద్రవరం సిటీలోని జీజీహెచ్ (ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి), క్వారీమార్కెట్ సెంటర్, మునిసిపల్ కార్యాలయం సమీపంలోని అన్న కేంటీన్లను పునఃప్రారంభించడం జరుగుతుందన్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్ ఆవరణలోని అన్న కేంటీన్ పనులను మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గర్గ్‌తో కలసి పరిశీలించారు. అన్న కేంటీన్ల ద్వారా పేదలకు మూడు పూటలా కేవలం రూ.15లకే నాణ్యమైన ఆహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గర్గ్ మాట్లాడుతూ అన్న కేంటీన్లలో పనులన్నీ రెండు, మూడు రోజుల్లో పూర్తవుతాయని తెలిపారు.


రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూల్చిన జగన్

అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 30 : జగన్మోహనరెడ్డి గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయిందని, రాజధాని నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. రాజమహేంద్రవరం బీజేపీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి సుమారు రూ.50 వేల కోట్ల లబ్ధి చేకూరుస్తూ కేటాయింపులు చేయడం అద్భుతమన్నారు. ప్రతిపక్ష హోదా కోసం న్యాయస్థానాలను ఆశ్రయించే దుస్థితికి జగన్మోహనరెడ్డి పరిస్థితి దిగజారిందన్నారు. అవినీతి, అక్రమాలలకు మాజీ సీఎం జగన్మోహనరెడ్డి కేరాఫ్ అడ్రస్‌గా ఉంటారన్నారు. వైసీపీ కాంగ్రెస్‌లో విలీనం కావడం ఖాయమని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి పాల్గొన్నారు.

సహకార సంఘాలు బలోపేతం చేయాలి

డీసీసీబీ సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్ జూలై30: సహకార రంగాన్ని పటిష్ట పరచాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ (డీసీసీబీ) సమావేశంలో మంగళవారం ఆమె మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సహకార సంఘాలు పూర్తి స్థాయిలో చురుకుగా ఉండేలా చూడాలన్నారు. సహకార సంఘాల ఆడిటింగ్, రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలన్నారు. సంఘాల పటిష్టతలో ఉత్పత్తి, మార్కెటింగ్ సామర్థ్యం పెంపు అత్యంత కీలకమైన అంశాలన్నారు. ఈ మేరకు వ్యవసాయ, హార్టికల్చర్, ఫిషరీస్, మార్కెటింగ్ తదితర విభాగాల ఆధ్వర్యంలో ఏఫ్‌పీవోలు ఏర్పాటు చేయడం ద్వారా సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయవచ్చన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఎన్జీవోలను గుర్తించి కనీసం ఏఫ్‌పీవోలో 300 మంది సభ్యులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ, డీఆర్‌వో నరసింహులు, జిల్లా సహకార అధికారి శ్రీరాములు నాయుడు, నాబార్డ్ ఎల్‌డీఎం,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఎస్పీ త్వరలో బదిలీ!

జిల్లాకు వచ్చేందుకు ఐదుగురు ప్రయత్నాలు

రాజమహేంద్రవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్(విజిలెన్స్ ఎస్పీ) కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి వారంలో బదిలీ కావొచ్చని తెలుస్తోంది. ఇప్పటికే పి.జగదీశ్, పాపారావు, ప్రసాద్, రాజేంద్ర కుమార్, సుమిత్ కుమార్ గాంధీ పేర్లు డీజీ వద్ద తుది పరిశీలనలో ఉన్నాయని చెబుతున్నారు. ప్రభుత్వం కూడా వీరిలో ఒకరిని నియమించాలని నిర్దేశించడంతో ఈ వారంలో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. జగదీశ్ ఐపీఎస్, సుమిత్ కుమార్ ఐఏఎస్ అధికారులు. వీరిలో జగదీశ్ తూర్పు గోదావరి ఎస్పీగా పని చేసి ఇటీవల బదిలీ అయ్యారు. ప్రస్తుతం డీజీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తూ పోస్టింగ్ కోసం వేచి ఉన్నారు.పాపారావు జిల్లాలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్)గా విధులు నిర్వర్తించి ఏడాది కిందట బదిలీపై సీఐడీకి వెళ్లారు. సుమిత్ కుమార్ గాంధీ రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్‌గా చేశారు. రాజేంద్ర కుమార్ గతంలో ఇదే విభాగంలో రాజమహేంద్రవరంలో డీఎస్పీగా పనిచేశారు. దీంతో ఇక్కడికే ఎస్పీగా రావడానికి గట్టిగా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఆయనకే అధికశాతం అవకాశం ఉందని అంటున్నారు.

25న జాంపేట బ్యాంక్ ఎన్నికలు

రాజమహేంద్రవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి) : జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గ ఎన్నికలు ఆగస్టు 25న తేదీన నిర్వహించనున్నామని.. షెడ్యూల్ 9న విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె సంబంధిత అధికారులతో సమీక్షించారు. పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేయాలని , జూన్ 8వ తేదీలోపు సభ్యులుగా చేరిన వారే ఓటు వేయడానికి అర్హులన్నారు. అప్పటికి మితిమీరిన బకాయిలు ఉన్నవారు అనర్హులేనన్నారు. ఇప్పటికే వాటి వివరాలు బ్యాంక్ బ్రాంచ్‌లలో ప్రదర్శించామని చెప్పారు. జాంపేట మెయిన్ బ్రాంచి కాగా, మోరంపూడి, ధవళేశ్వరం, సీతంపేట, అనపర్తి, పెద్దాపురం, కాకినాడ, గోకవరం, ఏలూరు, కొవ్వూరులలో బ్రాంచిలు ఉన్నాయన్నారు. వచ్చేనెల 9ననోటిఫికేషన్ జారీ అవుతుందని, 16న ఉదయం 11 గంటల నుంచి 5గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారని,అదే రోజు పోటీలో ఉండే అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తారన్నారు 17న స్క్రూటినీ, 18న ఉపసంహరణ గడువు ఉంటుందని అదే రోజు అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామన్నారు. 25వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ నిర్వహిస్తామని, 26న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తామన్నారు. 27న కొత్త చైర్మన్, పాలకవర్గాల భర్తీ ప్రక్రియ ఉంటుందని చెప్పారు.

ప్రశాంతంగా ఏపీపీఎస్సీ శాఖాపరమైన పరీక్షలు

రాజమహేంద్రవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించిన శాఖాపరమైన పరీక్షలు తొలి రోజు మంగళవారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా రెవెన్యూ అధికారి, ఏపీపీ ఎస్సీ జిల్లా నోడల్ అధికారి జి.నరసింహులు తెలిపారు. అయాన్ డిజిటల్ జోన్‌లో జరుగుతున్న పరీక్షల తీరును స్వయంగా పరిశీలించారు. ఉదయం పరీక్షలకు 241 మంది దరఖాస్తు చేసుకోగా 203 మంది, మధ్యాహ్నం పరీక్షలకు 211 మందికిగాను 177 మంది హాజరయ్యారన్నారు. బుధవారం ఉదయం పూట జరిగే పరీక్షకు 577 మంది హాజరు కావాల్సి ఉందన్నారు. ఏపీపీఎస్సీ సభ్యుడు ఎన్.సోనీవుడ్ పరీక్షల నిర్వహణను పరిశీలిస్తారని పేర్కొన్నారు.



వరదకు కొట్టుకుపోయిన కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారి



రహదారి ఛిద్ర(త్ర)ం

గోదావరి వరదలకు రహదారులు ఛిద్రమయ్యాయి. ముఖ్యంగా కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారి పోలిపాక వద్ద గోదావరి ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో వరద తగ్గుముఖం పట్టినప్పటికీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. పోలిపాక గ్రామానికి వెళ్లే సీసీ రోడ్డు వరద తాకిడికి నిట్టనిలువుగా చీలిపోయింది. (కుడివైపు చిత్రం)

- కూనవరం



బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

తగ్గుతున్న గోదావరి

ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

12.60 అడుగులకు తగ్గిన నీటిమట్టం

11.19 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

భద్రాచలం వద్ద స్వల్పంగా పెరుగుతున్న వరద

ధవళేశ్వరం, జూలై 30: ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. మంగళవారం ఉదయం ఆరు గంటలకు నీటిమట్టం 13.70అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. గంటకు ఒక్క పాయింటు చొప్పున క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం రాత్రి ఏడు గంటలకు 12.60 అడుగులకు చేరుకోగా 11,19,425 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. బుధవారం నాటికి మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించే స్థాయికి నీటిమట్టం తగ్గవచ్చని అధికారుల అంచనా. ఎగువన తెలంగాణ పరివాహకంలోని లక్ష్మి బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేయడంతో కాళేశ్వరం వద్ద నీటిమట్టం పెరుగుతోంది. ఆ ప్రభావంతో దిగువన భద్రాచలం వద్ద నీటిమట్టం పెరగడంతో మళ్లీ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మంగళవారం రాత్రి ఏడు గంటలకు నీటిమట్టం 43.60 అడుగులుగా నమోదైంది.

మొన్న...



తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నుంచి ఒడిసాకు వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ నవీన్ నిద్రమత్తు కారణంగా చింతూరు మండలం నిమ్మలగూడెం-కుయుగూరు మధ్య జాతీయ రహదారిపై వరద నీటిలో మునిగిపోయింది. అతడు ఆదివారం రాత్రంతా తాటిచెట్టుపై ఉండి ప్రాణాలతో బయటపడిన విషయం విదితమే. రహదారిపై వరద నీరు మంగళవారం క్రమంగా తగ్గడంతో టిప్పర్ బయటపడింది.

- చింతూరు

నేడు...





దాతకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఈవో కిషోర్‌కుమార్

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, జూలై 30: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కాకినాడ జిల్లా తుని మండలం ఎస్.అన్నవరానికి చెందిన దాడిశెట్టి విష్ణు చక్రం-రమాజ్యోతి దంపతులు రూ.1,00,500 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటాన్ని ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ అందించారు. వివిధ సేవల ద్వారా మంగళవారం రూ.2,14,376 ఆదాయం లభించినట్టు ఆయన చెప్పారు.



అపర్ణాదేవికి కదంబ పుష్పాలతో పూజ

గొల్లప్రోలు రూరల్, జూలై 30: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణా సమేత నాగేశ్వరస్వామికి మంగళవారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి వేద పండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రి కుంకుమ పూజ, సహస్ర నామార్చన జరిపి కదంబ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



నాటు తుపాకీతో ఇద్దరి అరెస్టు

గోకవరం, జూలై 30: నాటు తుపాకీ కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను గోకవరం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్ఐ కె.నాగరాజు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... గంగవరం మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన పాతర అప్పారావు, రంపచోడవరం మండలం గొట్లగూడెం గ్రామానికి చెందిన పోడియం పొట్టిదొర గోకవరం మండలం కొత్తపల్లి గ్రామ శివారులో నాటు తుపాకీతో సంచరిస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన వీఆర్వో ఎం.వెంకట్రావు ఫిర్యాదు మేరకు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని వారి నుంచి నాటు తుపాకీ, మోటారు సైకిలు స్వాధీనం చేసుకున్నారు. సూరంపాలెం ప్రాజెక్టు పరసర ప్రాంతాల్లో వేటాడేందుకు వెళ్లి అక్కడ వేపచెట్టు కింద నాటు తుపాకీతో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు నిద్రపోయినట్టు విచారణలో తేలింది.

కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయ క్లర్క్‌పై విచారణ

కాకినాడ క్రైం, జూలై 30: జిల్లా ఎస్పీ కార్యాలయంలో డిస్పాచ్ విభాగంలో పనిచేస్తున్న జి.శ్రీనివాస్ ఉన్నతాధికారులకు వచ్చిన లేఖలను విప్పి చదువుతూ వాటిని ఫొటో తీసి చివరికి అధికారులకు పట్టుబడ్డాడు. శ్రీనివాస్ లెటర్ల ఎన్వలప్ కవర్లను తెరిచి వాటి లోపల ఉన్న లేఖలను ఫొటో తీసి తిరిగి అంటించి ఏ అధికారి లెటరు ఆ అధికారికి పంపిస్తున్నాడు. కొత్త ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు వచ్చిన లేఖను శ్రీనివాస్ చదివి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. సోమవారం సాయంత్రం ఎస్పీకి వచ్చిన లెటర్ ఎన్వలప్ కవరు అతికిన విధానాన్ని ఎస్పీ నిశితంగా పరిశీలించారు. కవరు జిగురు అప్పుడే అటించి ఉన్నట్లు గమనించారు. దీంతో డిస్పాచ్ క్లర్క్ శ్రీనివాస్‌ను పిలిచి తాను చేసిన తప్పును తన నోటితో చెప్పించారు. అనంతరం శ్రీనివాస్‌కు చార్జ్ మెమో ఇచ్చారు. ఇదే తరహాలో గ్రీవెన్స్‌కు వచ్చే పిటీషన్‌లు శ్రీనివాస్ తెరిచి చూస్తున్నాడనే అనుమానాలు రేకత్తడంతో అతడిపై విచారణ చేయాలని ఎస్పీ ఆదేశించారు.





పి.గన్నవరం అక్విడెక్టు వద్ద యువకుడి మృతదేహాన్ని బయటకు తీస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం, ఉడిమూడిలో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

విషాదాంతం

పడవ ప్రమాదంలో గల్లంతైన విజయకృష్ణ మృతదేహం పి.గన్నవరం అక్విడెక్టు వద్ద లభ్యం

పి.గన్నవరం, జూలై 30: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటి పెదపూడి వద్ద పడవ ప్రమాదంలో గల్లంతైన చదలవాడ విజయకృష్ణ ఆచూకీ పి.గన్నవరం అక్విడెక్టు వద్ద మంగళవారం లభ్యమైంది. అక్విడెక్టు కాల్వ తొట్టెకు అడ్డుపడిన చెత్తలో మృతదేహాన్ని గుర్తించిన బంధువులు అధికారులకు సమాచారం అందించారు. ఎస్ఐ బి.శివకృష్ణ అక్విడెక్టు వద్దకు చేరుకుని ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో సుమారు రెండు గంటల పాటు కష్టించి బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని అక్విడెక్టు వద్ద ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరిశీలించి ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. కాగా విజయకృష్ణ కుటుంబాన్ని ఉడిమూడిలో కోనసీమ జిల్లా కలెక్టర్ ఎం.మహేష్‌కుమార్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరామర్శించి ప్రభుత్వం అందించిన రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఎంతవరకు చదువుకున్నావని మృతుని సోదరిని కలెక్టర్ అడిగి ఉద్యోగం వచ్చే ఏర్పాటు చేస్తానని చెప్పారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ఆర్థిక సాయం అందించామని ఎమ్మెల్యే చెప్పారు. నెల వ్యవధిలో మృతుడు సోదరి కళ్యాణికి ఉద్యోగం వచ్చేలా చూస్తామన్నారు. తహసీల్దారు ఎస్‌కే హుస్సేన్, సర్పంచ్ ఎన్.ప్రసన్న కుమార్, మద్దా చంటిబాబు, వాసంశెట్టి కుమార్, తాటికాయల శ్రీనివాసరావు, ఏసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

ఐదుగురు అరెస్టు.. 75 సెల్‌ఫోన్లు స్వాధీనం

అమలాపురం టౌన్, జూలై 30: ఆన్‌లైన్ బెట్టింగ్ జరుగుతోందన్న సమాచారంతో అమలాపురం పట్టణ పోలీసులు పక్కా ప్రణాళికతో దాడి చేశారు. బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. సీఐ కె.క్రిస్టఫర్ తెలిపిన వివరాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న అంబికా లాడ్జిలో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. అమలాపురం రూరల్ భట్లపాలెం గ్రామానికి చెందిన మోటూరి దొరసత్యసూర్య మణికంఠ అలియాస్ నాని (25), మోటూరి మధుపవన్ అలియాస్ సతీష్ (23), ఏలూరు జిల్లా కైకలూరుకు చెందిన భలేప్రవీణ్‌బాబు (27), భీమవరం సమీపంలోని గునుపూడికిచెందిన పంజా సాయినరసింహ అలియాస్ (నాని) (19), గురజాపు సూర్యప్రభు అలియాస్ సూర్య (21)లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఐదు ల్యాప్‌టాప్‌లు, 75 సెల్‌ఫోన్లు 15 సిమ్‌కార్డులు, 19 బ్యాంక్ చెక్‌బుక్‌లు, 25 ఏటీఎం కార్డులు, 7 నోట్‌బుక్‌లు, ఒక వైఫై రూటర్ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం అమలాపురం కోర్టులో హాజరుపరిచారు. గూగుల్ ప్లేస్టోర్‌లో ఉన్న యాప్‌ల్లోకి వాట్సాప్ లింకుల ద్వారా ప్రవేశించి బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు గుర్తించారు. ఆ యాప్‌లను తొలగించేందుకు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గూగుల్‌కు లేఖలు పంపించామన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాను అరెస్టు చేసిన పోలీసులను ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.



ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

సుబ్రహ్మణ్యం కుటుంబానికి ప్రభుత్వ సాయం అందేలా కృషి

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

కాకినాడ సిటీ, జూలై 30: హత్యకు గురైన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి ప్రభుత్వ సాయం అందేలా కృషి చేస్తానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కారు డ్రైవర్‌గా పని చేసిన తమ కుమారుడు సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసిన వారికి శిక్షపడేలా చేసి తమకు న్యాయం చేయాలని అతని తల్లిదండ్రులు మంగళవారం ఎమ్మెల్యే కొండబాబును కలిసి విన్నవించారు. బాధిత కుటుంబం పరిస్థితిని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్ ఎమ్మెల్యేకు వివరించారు. అప్పట్లో సుబ్రహ్మణ్యం హత్య ఘటన సమయంలో బాధిత కుటుంబా నికి అండగా నిలబడిన కొండబాబు ప్రస్తుతం అధికారంలో ఉన్నందున సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి దోషులకు శిక్షపడేలా చూడాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే కొండబాబు సానుకూలంగా స్పందిస్తూ బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు, నగర ఉపాధ్యక్షుడు బంగారు సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొండబాబుతో సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు

కరెంట్ షాక్‌తో పశ్చిమ బెంగాల్ వాసి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు.. టవర్లపై ఎర్త్ వైర్ లాగుతుండగా ఘటన

కరప, జూలై 30: కాకినాడ జిల్లా కరప మండలం అరట్లకట్ట పంట పొలాల్లో మంగళవారం ఉదయం కరెంట్ షాక్ తగిలి పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన యువకుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎనిమిది మంది కూలీలు అరట్లకట్టలో ట్రాన్స్‌కోకు చెందిన 132/11 కేవీ విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నారు. దీనిలో భాగంగా అక్కడున్న నాలుగు టవర్లలో రెండు టవర్ల మీద ముగ్గురేసి చొప్పున ఎక్కి ఎర్త్ వైరును లాగుతున్నారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా ఎలక్ట్రికల్ ఇండక్షన్ (విద్యుత్ ప్రేరణ) కలగడంతో రెండు టవర్ల మీద ఉన్న కూలీలు ఎర్త్ వైర్‌ను వదిలేశారు. అదే సమయంలో కింద పనిచేస్తున్న షేక్ షహిదుల్(20)పై ఎర్త్ వైరు పడడం, అతను బురదలో ఉండడంతో విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అక్కడే ఉన్న మరో కూలీ కూడా షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. షహిదుల్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మరో క్షతగాత్రుడు ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

షహిదుల్ మృతితో సహచర కూలీలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కూలీల్లో మృతుడి సోదరులు కూడా ఉన్నట్టు తెలిసింది. వారు పశ్చిమ బెంగాల్‌లో ఉన్న షహిదుల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జిల్లాకు చెందిన ఒక ప్రజాప్రతినిధి బంధువు కాంట్రాక్టర్‌గా ఈ పనులు చేయిస్తున్నట్టు తెలిసింది. దీంతో విషయం బయటకు పొక్కకుండా ట్రాన్స్‌కో అధికారులు ప్రయత్నించినట్టు సమాచారం. కరప పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.



ప్రేమించానని వంచన

- తట్టుకోలేక యువతి ఆత్మహత్య
- యువకుడి అరెస్టు... రిమాండుకి తరలింపు

రాజమహేంద్రవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి ఆత్మహత్యకు కారణమైన యువకుడిని అరెస్టు చేశామని సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబికానగర్‌లో నివసిస్తున్న 29ఏళ్ల దళిత యువతి సీతానగరం మండలం వంగలపూడికి చెందిన 22ఏళ్ల షేక్ నాగూర్‌బాబు నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెద్దలకు తెలియడంతో ఏడాది తర్వాత పెళ్లి చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో ఆమెతో నాగూర్ అనేక విధాలైన లోన్లు పెట్టించాడు. ఆ విధంగా మొత్తం రూ.11,97,417 తన సొంతానికి వాడుకున్నాడు. తర్వాత ఆమెను వదిలించుకోడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఉద్దేశపూర్వకంగా ఆమెను కులం పేరుతో బూతులు తిట్టడంతో పాటు తీవ్రమైన మానసిక వేదనకు గురిచేశాడు. దీంతో గత నెల 29వ తేదీ అర్ధరాత్రి సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మరుసటి రోజు మరణించింది. యువతి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని డీఎస్పీ పేర్కొన్నారు. ఆమె హ్యాండ్ బ్యాగ్‌లో సూసైడ్ నోట్ ఉండడంతో పాటు పలు విషయాలు వెలుగు చూశాయన్నారు. సాక్ష్యాధారాలను సేకరించి నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు.

వివాహం కావట్లేదన్న మనస్తాపంతో తమ్ముడిపై కత్తితో అన్న దాడి

కొత్తపల్లి, జూలై 30: ఇంట్లో అందరికీ వివాహాలు జరిగి మధ్యలో ఉన్న తనకు వివాహం కావట్లేదన్న మనస్తాపంతో సొంత తమ్ముడిపై అన్న బండ కత్తితో దాడి చేసిన ఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం శ్రీరాంపురంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీరాంపురం గ్రామానికి చెందిన పిర్ల రామకృష్ణ కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ముల మధ్యవాడు. పెద్ద కుమారుడికి, చిన్న కుమారుడికి వివాహాలు జరిగాయి. మధ్యలో ఉన్న వివాహం కాని రామకృష్ణకు ఫిట్స్ రావడంతో తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. రామకృష్ణ అన్న కుమారునికి ఆరోగ్యం బాగోక మూడు రోజులుగా కాకినాడ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. అన్న రామకృష్ణకు సోదరుడు సత్తిబాబు మంగళవారం మధ్యాహ్నం భోజనం క్యారేజీ తీసుకొచ్చాడు. మూడు రోజుల పాటు తనకు తిండి, తిప్పలు లేవని, ఒంటరిగా వదిలేశారని కోపోద్రిక్తుడైన రామకృష్ణ తమ్ముడు సత్తిబాబు మెడపై బండ కత్తితో దాడి చేశాడు. బాధితుడిని పిఠాపురం ఆసుపత్రికి తరలించారు. కొత్తపల్లి పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

ఐటీడీఏలకు మళ్లీ మహర్దశ

రంపచోడవరం, జూలై 30: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మూడు ఐటీడీఏలకు మళ్లీ మహర్దశ పట్టనుంది. మంగళవారం అమరావతిలో గిరిజన సంక్షేమం, అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించి మంత్రి గుమ్మడి సంధ్యారాణికి, ఇతర ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. 2014-19 కాలంలో రూపొందించిన అభివృద్ధి, సంక్షేమ ప్రణాళికలు వైసీపీ పాలనలో మూలనపడడం, గిరిజనులు ఐటీడీఏలకు దూరమవ్వడం వంటి అంశాలను ముఖ్యమంత్రి సీరియస్‌గా తీసుకున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో గిరిజన సహకార సంస్థ, ట్రైకార్ వంటి వ్యవస్థలు అలంకారంగా మారి గిరిజనుల జీవన ప్రమాణాలను సైతం దెబ్బతీశాయి. ముఖ్యంగా గత ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమాన్ని ఆశించి రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏలకు వచ్చే గిరిజనుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఒక విధంగా ఐటీడీఏలు ఉన్నాయన్న విషయాన్నే గిరిజనులు విస్మరించే పరిస్థితులున్నాయి.

విద్య, వైద్య రంగాల్లో గిరిజనులకు అందాల్సిన అనేక ప్రయోజనాలు 2019 తర్వాత అంతగా అందలేదు. ఐటీడీఏ లను ఆశ్రయించినా తగిన న్యాయం జరగని దుస్థితి గిరిజనులను అనేక ఇబ్బందులకు గురిచేసింది. ఈ విషయాలను గత ఐదు సంవత్సరాల ప్రగతి నివేదికల ద్వారా తెలుసుకున్న సీఎం చంద్రబాబు సదరు లోపాలపై అధికారులను నిలదీశారు. భవిష్యత్తులో ఐటీడీఏల నుంచి గిరిజనులకు ఎటువంటి అసౌకర్యాలు కలగరాదని, మరింత ఉత్తమంగా ఐటీడీఏల నుంచి సేవలు అందేలా చూడాలని, ఎక్కడా కూడా ఆరోగ్య సేవల కోసం గిరిజనులు డోలీలపై తరలించడం వంటి పరిస్థితులు కలగరాదని సూచించారు.

అల్లూరి జిల్లాకు వరద సాయం రూ.10 కోట్లు విడుదల

కలెక్టర్ దినేష్ వినతి మేరకు జీవో జారీ చేసిన ప్రభుత్వం

రంపచోడవరం, జూలై 30: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, గోదావకి వరదల ప్రభావిత కుటుంబాలకు సహాయం చేసేందుకు ప్రభుత్వం రూ.10 కోట్లు విడుదల చేస్తూ మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. అల్లూరి జిల్లాలో పరిస్థితులపై కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రభుత్వానికి నివేదిస్తూ సాయం కోసం రూ.15.29 కోట్ల అవసరమవుతాయన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలించి రూ.10 కోట్లను వరద సహాయానికి వినియోగించుకోవచ్చని కలెక్టరును ఆదేశించింది. 30 రోజులలోగా ఎవరెవరికీ సాయం అందించారో, దేనికి వెచ్చించారో ప్రభుత్వానికి నివేదించాలని ఆ ఉత్తర్వులో ప్రభుత్వం సూచించింది.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

ఆదివాసీల కోసం అంబులెన్సు

సిద్ధం చేసిన రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి

ఆదివాసీ దినోత్సవం నాడు అంకితం చేయడానికి నిర్ణయం



రంపచోడవరం, జూలై 30: రంపచోడవరం నియోజకవర్గంలోని ప్రజలకు ఎమ్మెల్యే శిరీష దేవి దంపతులు తమ సొంత ఖర్చులతో ఒక అంబులెన్సును సిద్ధం చేశారు. మన్యంలో ప్రజలకు అంబులెన్సు తరచూ అవసరం ఎక్కువ ఉండడంతో ఐటీడీఏ, ప్రభుత్వ ఆసుపత్రుల అంబులెన్సులు దొరకని పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎమ్మెల్యే దంపతులు ఈ ఏర్పాట్లు చేశారు. ఆగస్టు 9న జరిగే ఆదివాసీ దినోత్సవం నాడు ఈ అంబులెన్సును అంకితం చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఆ నాటి నుంచి అంబులెన్సు అవసరమైన వారి కోసం ఒక ఫోను నెంబరును సిద్ధం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో అంబులెన్సు కోసం ఆయా ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్యేపై ఒత్తిడి తెస్తున్నారు. ఆయా పరిస్థితుల్లో ఐటీడీఏ, ఆసుపత్రుల అంబులెన్సులు వేరే పేషెంట్ల కోసం తరలి వెళ్లడంతో ఒక అంబులెన్సును సిద్ధం చేయాలన్న నిర్ణయానికి ఎమ్మెల్యే శిరీష దేవి, ఆమె భర్త విజయభాస్కర్ వచ్చారు. తమ సొంత ఖర్చుతో దీనిని సమకూర్చుతున్నారు. ఈ నిర్ణయంపై మన్యం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం



వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

వర రామచంద్రాపురం, జూలై 30: వరద బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రేఖపల్లిలోని పునరావాస కేంద్రాల్లో నివాసముంటున్న వరద బాధితులను మంగళవారం ఆమె పరామర్శించారు. ప్రతిఏటా ఈ నరకాన్ని భరించలేమని, పోలవరం నష్టపరిహారం త్వరగా ఇప్పించి పుణ్యం కట్టుకోవాలని ఎమ్మెల్యేకు బాధితులు విజ్ఞప్తి చేయగా ఆమె సానుకూలంగా స్పందించారు. అనంతరం తహసీల్దారుతో మాట్లాడి వరద బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. మాజీ ఎంపీ సోడె రామయ్య ఎమ్మెల్యేను కలిసి వరద బాధితుల సమస్యలను పరి ష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ డి.రామారావు, తహసీ ల్దారు మౌలానాఫాజిల్, ఎస్ఐ నాగరాజు, తెలుగు యువత అధ్యక్షుడు మఠం భాస్కర్, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ఆచంటి శ్రీను, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, సీనియర్ నాయకులు బొర్ర నరసింహారావు, బొర్ర నరేష్‌కుమార్, బీరక ప్రకాష్‌రావు, గొంది చంద్రయ్య, జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం అందజేత



బాధితురాలికి రూ.3 వేలు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

కూనవరం, జూలై 30: వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.3వేలు సాయాన్ని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మంగళవారం అందజేశారు. ఏపీఆర్ బాలికల పాఠశాలలో తలదాచుకున్న వరద బాధితులకు ఈ సహాయాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామన్నారు. రేషన్ కార్డు లేని కుటుంబానికి సైతం సహాయం అందజేస్తామన్నారు. తమకు పోలవరం పరిహారం అందించాలని బాధితులు ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించగా సీఎం చంద్రబాబు సైతం సానుకూలంగా స్పందించారన్నారు. ఏజెన్సీ ప్రజలపై తాను ప్రత్యేక దృష్టి సారించానని, ఎవరికి ఆపద వచ్చినా వెంటనే తనకు తెలియజేయాలన్నారు. విలీన మండలాలకు తన సొంత ఖర్చుతో అంబులెన్స్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య, తెలుగు యువత అధ్యక్షుడు మఠం భాస్కర్, గడ్డిపాటి ప్రసాద్, ఇంటి భాస్కర్, నోముల సత్యనారాయణ, చలకాని ఉమామహేశ్వరరావు, హెచ్.రాము, గణేశుల రంజిత్‌కుమార్, నరేంద్ర, పాయం వెంకయ్య, హేమంత్, బండారు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

భారీ వృక్షం తొలగింపు



రహదారిపై పడిన వృక్షాన్ని ఎక్స్‌కవేటరుతో తొలగిస్తున్న దృశ్యం

మోతుగూడెం, జూలై 30: మోతుగూడెం పరిధిలోని మల్లవరం ఫోర్‌బై మార్గమధ్యంలో భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఏపీ జెన్‌కో పొల్లూరు ప్రాజెక్టు సివిల్ (ఏడీఈ) కొండలరావు, ఏఈ సాయిపవన్, క్రేన్ ఆపరేటర్ సతీష్ రాఘవన్ (ఫోర్‌మెన్), కొట్టు శ్రీనివాసరావు, రమేష్, రవి, సిబ్బందితో కలిసి చెట్టును తొలగించారు. జెన్‌కో కాంట్రాక్టు కార్మికులు జోసెఫ్, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పెరిగి.. శబరి తగ్గి..

చింతూరు, జూలై 30: భద్రాచలం వద్ద గోదావరి మళ్లీ పెరుగుతోంది. మంగళవారం సాయంత్రానికి అక్కడ నీటిమట్టం 43.60 అడుగులకు చేరింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు వద్ద శబరి నెమ్మదిగా తగ్గుతోంది. నీటిమట్టం 34.5 అడుగులుగా నమోదైంది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళ్లే 326వ జాతీయ రహదారిపై చింతూరు మండలం చట్టి వద్ద వరద నీరు తగ్గింది. దీంతో ఆయా రాష్ట్రాల మధ్య రాకపోకలు పునరుద్ధరణ అయ్యాయి. ఏపీ నుంచి ఒడిసాకు వెళ్లే 30వ నెంబరు జాతీయ రహదారిపై చింతూరు మండలం నిమ్మలగూడెం, కుయుగూరు మధ్య ఇంకా వరద నీరు ఉండడంతో అటుగా రాకపోకలు సాగే పరిస్థితి లేకుండా పోయింది. చింతూరు, వరరామచంద్రపురం మండలాల మధ్య ప్రధాన రహదారిపై ఇంకా వరద నీరు ఉంది. వరద తగ్గిన ప్రదేశంలోని రహదారిపై బురద పేరుకుపోయింది. చింతూరు, కూనవరం మండలాల నడుమ రహదారిపై వరద తగ్గడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

బోండ్ల వరప్రసాదరావు



రంపచోడవరం, జూలై 30: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ఆదివాసీ హక్కుల వేదిక అధ్యక్షుడు బోండ్ల వరప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆగస్టు 9న జిల్లా, నియోజవర్గ ప్రధాన కేంద్రాల్లో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలతో నిర్వహించాలన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఐటీడీఏలో నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే శిరీషదేవిని కోరారు.

నేడు ప్రజా దర్బార్ ప్రారంభం

కోరుకొండ, జూలై30: ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం కోరుకొండ మండల ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 నుంచి 1గంట వరకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయం తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆయాశాఖల అధికారులు, ఎన్డీయే నాయకులు పాల్గొంటున్న ఈ జనవాణిలో కోరుకొండ మండల పరిధిలోని 22 గ్రామాల ప్రజలు ఎవరికి ఎటువంటి సమస్య ఉన్నా అర్జీ రూపంలో ఎమ్మెల్యేకు అందజేస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆసమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

● రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30: క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు బుధవారం పుస్తకాలు పంపిణీచేసి మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుని ఎందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. ఎక్కడ చదివామన్నది కాదు.. ఎలా చదువుతున్నాం.. ఎంత నేర్చుకున్నాం అన్నదే ముఖ్యమన్నారు. జూనియర్ కళాశాలలో మరో పది అదనపు తరగతులు నిర్మిస్తామని.. నాడు నేడు పనులను వేగవంతం చేస్తామన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంద్వారా ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాలను ఉపయోగించుకుని మంచి ఫలితాలు పొందాలన్నారు.తొలుత కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. డీఐవో ఎన్‌వీఎస్ఎల్ నరసింహం, డీవైఈవో జేవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, డీఈవో కే.విశ్వనాథం, పీవో సర్వశిక్ష అభియాన్ ఎస్.సుభాషిణి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దిలీప్ కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి..

ధవళేశ్వరం, జూలై30: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలోచదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. త్వరలోనే కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్నాభోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల క్రీడా ప్రాంగణాన్ని విడదీసి గోడ నిర్మించడంతో క్రీడామైదానం లేకుండా పోయిందని ఆ గోడను తొలగించాలని విద్యార్థులు గోరంట్ల దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై ఆయన స్పందిస్తూ ప్రాంగణంలోని కల్యాణ మండపం కోసం ఈ గోడను నిర్మించడంతో పాటు కల్యాణ మండపాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారని దీనిపై దృష్టి సారించి తగు నిర్ణయం తీసుకుంటామని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో డీవీఈవో జీవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, కళాశాల అధ్యాపక సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకులు పిన్నంటి ఏకబాబు, ఆళ్ళ ఆనందరావు, తలారి మూర్తి, యర్రమోతు ధర్మరాజు, బత్తిన ఏడుకొండలు, సావాడ శ్రీనివాస రెడ్డి, కొత్తూరు దుర్గారావు, నాళ్ల రమేష్ దాసరి సాగర్, కొడమంచలి సూర్య, ముచ్చి నాని, జనసేన నాయకులు బీరా ప్రకాష్, అల్లంపల్లి ముత్యాలు, బీజేపీ నాయకులు ఒంటెద్దుస్వామి, గుర్రాల వెంకట్రావు పాల్గొన్నారు.

కన్నమ్మతల్లి జాతర మహోత్సవంలో గోరంట్ల ప్రత్యేక పూజలు

రాజమహేంద్రవరంరూరల్, జూలై 30: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో కార్పొరేషన్ 27వ డివిజన్ రెడ్డీలపేటలో ఉన్న కన్నమ్మతల్లి జాతర మహోత్సవంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారంరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న గోరంట్లకు ఆలయకమిటీ ఘనంగా స్వాగతం పలికి సత్కరించింది. కార్యక్రమంలో బూరా దుర్గాంజనేయరావు, కొప్పిశెట్టి చిన్ని, శీలం గోవిందు, కిషోర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● హుకుంపేటలో ముంపు బాధితులకు సాయం అందజేత

రాజమహేంద్రవరంరూరల్ మండలం హుకుంపేటలో ముంపు ప్రాంతంలో బాధితులకు ప్రభుత్వం తరపున అందించే సాయాన్ని టీడీపీ వైద్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్‌కిరణ్ అందజేసారు. అదేవిధంగా వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసి మందులు అందించారు.

శాంతి భద్రతలు.. మహిళా రక్షణ మా ధ్యేయం

● మీ భద్రత.. మా బాధ్యతలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



పుస్తకాలు పంపిని చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30 : రాజమహేంద్రవరంలో బ్లేడ్ ,గంజాయి బ్యాచ్ అనే పదాలు వినబడకుండా పోలీస్ ,ఇతర శాఖల సమన్వయంతో పూర్తిగా అరికడతామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. 46వ డివిజన్‌లో మంగళవారం జరిగిన మీ భద్రత..మా బాధ్యతలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2019-24 మధ్య రాజమహేంద్రవరంలో బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి బ్యాచ్‌లు పెరిగిపోయాయని వాటిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కృషి చేస్తున్నామన్నా రు. మహిళలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, నాయకులు అగురు ధనరాజు, మొకమాటి సత్యనారాయణ, కొయ్యల రమణ, తురకల నిర్మల, మండల రవి, పిడిమి ప్రకాష్, కేబుల్ మురళీ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

ఒకటో డివిజన్‌లో కేర్ ఫర్ ఆల్‌వెల్ఫేర్ సొసైటి ఛైర్మన్ పాస్టర్ డి.కోటేశ్వరరావు ,దేవామణి పర్యవేక్షణలో, సొసైటీ, క్రైస్టచర్చ్ సంయుక్త ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు మంగళవారం పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నగర ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకిరామయ్య, మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ, కమిటీ సభ్యులు మారిశెట్టి నరసింహమూర్తి, డి.లక్ష్మణరావు, పి.దేవానంద్, కె.శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

భక్తులతో బిక్కవోలు కిటకిట



బిక్కవోలు, జూలై 30: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన ఆడి కృత్తికా సందర్భంగా బిక్కవోలులోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం ఉదయం నుంచి భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు. రజ, కుజ, సర్ప దోష నివారణార్థం భక్తులు స్వామికి వ్రతాలు ఆచరించారు. ఆలయ అర్చకులు సన్నిధిరాజు సుబ్రహ్మణ్యశర్మ, కొడమంచిలి సత్యనారాయణశర్మలు స్వామిని పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు దేవదాయశాఖ ఆధ్వర్యంలోను అన్నదాన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో రామలింగబాస్కర్ తెలిపారు. గోలింగేశ్వర, సుబ్రహ్మణ్యస్వామి అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేశారు.

బిక్కవోలు, గొల్లలమామిడాడను

టెంపుల్ టూరిజం హబ్‌గా మారుస్తాం

● ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, జూలై 30: బిక్కవోలులోని లక్ష్మీగణపతి, గోలింగేశ్వరస్వామి, గొల్లలమామిడాడలోని రామాలయం, సూర్యనారాయణమూర్తి ఆలయాల ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి తెలిసేలా టెంపుల్ టూరిజం హబ్‌గా మారుస్తామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన బిక్కవోలు ఎంపీడీవో కార్యాలయంలో డీసీ విజయరాజుతో నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి ప్రతిపాదనలపై చర్చలు జరిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 60 ఆలయాలు ఉన్నాయని వీటిలో బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయం పెద్దదని ఇక్కడ ఆదాయం ఎక్కువవున్నా వసతులు లేవన్నారు. అందువల్ల ఆలయ అభివృద్ధికి దేవదాయశాఖ ప్రతిపాదనలు తయారు చేస్తే దేవదాయశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులుకు కృషి చేస్తామన్నారు. కేంద్రంలో ప్రసాద్ అనే పథకం ఉందని ఈపథకం ద్వారా రూ.50కోట్లు నిధులు తీసుకువచ్చి నియోజకవర్గంలోని దేవాలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. వీటిలో బిక్కవోలులోని లక్ష్మీగణపతి, గోలింగేశ్వరస్వామి, రంగంపేట మండలంలోని భజే నారాయణస్వామి, రామవరం మండలంలోని శివాలయం, పెదపూడి మండలంలోని సూర్యనారాయణమూర్తి, రామాలయం, పుట్టగొండ లక్ష్మీనరసింహస్వామి, పైనలోని వీరభద్రేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయన్నారు.

దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదం

రాజానగరం, జూలై 30: విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదం చేస్తుందని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జి.జి.యు) ఉపకులపతి డాక్టర్ యు.చంద్రశేఖర్ అన్నారు. జి.జి.యు. ప్రాంగణంలో కాకినాడ గ్రూప్ ఎన్.సి.సి.18 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షిక శిక్షణశిబిరంలో భాగంగా మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరిబాధ్యత అన్నారు.

ప్రభుత్వ కళాశాల లెక్చరర్ కే.సీతామహాలక్ష్మి భేటీ

పఢావో-భేటీబచావో ఈనే అంశంపైన, గైట్ వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వి.ఎస్.ఎన్.మూర్తి నాయకత్వ లక్షణాలు అనే అంశంపైన అతిథి ఉపన్యాసాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ మేజర్ మహ్మద్ ఆసిఫ్, గైట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, గైట్ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ పి.ఎం.ఎం.ఎస్.శర్మ, వైస్‌ప్రిన్సిపాల్ ఎస్.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎన్.సి.సి.ఎ.ఎన్.ఓ. ఏ.తేజేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మోదకొండమ్మ గ్రామోత్సవం

కోరుకొండ, జూలై30: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం మంగళవారం మోదుకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం గ్రామోత్సవం వైభవంగా జరిగింది. వారం రోజుల పాటు జాతర అనంతరం మంగళవారం గ్రామోత్సవం జరిగింది. కళాకారులు పుట్టిల్లు అయిన శ్రీరంగపట్నం గ్రామంలో కళాకారులంతా అమ్మవారి గ్రామోత్సవంలో రకరకాల వేషధారణలతో అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, బత్తుల వెంకటలక్ష్మి దంపతులు దర్శించుకుని పూజలు చేశారు.టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు, పలువురు ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అమ్మవారిని దర్శించుకున్నారు.

'ఇచ్చినమాట నిలబెట్టుకునేదే కూటమి ప్రభుత్వం'

బిక్కవోలు, జూలై 30: దివ్యాంగుల పింఛన్ రూ.3వేల నుంచి రూ.6 వేలకు పెంచి ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని దివ్యాంగులు పింఛన్లు రెట్టింపు చేసిన సందర్భంగా కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో వున్నా పింఛన్లు పెంచి, వలంటీర్లు లేకుండా 1వ తేదీనే పంపిణీ చేస్తున్నామన్నారు. చంద్రబాబు చాణిక్యం, పవన్‌పవర్, మోదీ సహకారంతో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామ న్నారు. అనంతరం మండలంలోని దివ్యాంగులు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించి, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగ సంఘ నేతలు ఆదినారాయణ, చంద్రశేఖర్, కూటమి నేతలు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, ఇందల వీరబాబు, పవన్‌కుమార్, సిరసపల్లి నాగేశ్వరరావు, బాబా, ఇన్‌చార్జి ఎంపీపీ కన్నారావు, ఎంపీడీవో విజయలక్ష్మి, డీటీ కృష్ణ పాల్గొన్నారు.

'మానవ అక్రమ రవాణాపై అవగాహన పెంచుకోవాలి'

రాజానగరం, జూలై 30 : మానవ అక్రమరవాణా అనే సాంఘిక సమస్యపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లాన్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు అన్నారు. తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచమానవ అక్రమ రవాణా దినోత్సవంను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్టఅతిథిగా విచ్చేసిన ప్రకాష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థిదశలో వచ్చే వివిధ సమస్యలను అనేక వాస్తవిక కథనాలతో వివరించారు. డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ సోషల్ మీడియా ఆప్స్ వినియోగంపై స్వీయనియంత్రణ అవసరం అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేశాఖ అధికారి పి.ఎస్.రమేష్, మహిళా శిశుసంక్షేమశాఖ పీడీ విజయకుమారి, గిరిజన సంక్షేమశాఖ అధికారి జ్యోతి, కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీరావు, వైస్ ప్రిన్సిపాల్ సూరిబాబు పాల్గొన్నారు.

వెంకటరమణకు డాక్టరేట్ ప్రదానం

దివాన్‌చెరువు, జూలై 30 : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో మొట్టమొదటిసారిగా పీహెచ్‌డీ పూర్తి చేసిన దకర వెంకటరమణకు ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు డాక్టరేట్‌ను మంగళవారం ప్రదానం చేశారు. నన్నయ వర్సిటీ తెలుగుశాఖ అధ్యక్షుడు కె.వి.ఎన్.డి.వరప్రసాద్, సహపర్యవేక్షకులు మోగంటి సుధామయి పర్యవేక్షణలో పి.వి.సునీల్‌కుమార్ సాహిత్యం-సమాలోచన అనే అంశంపై పరిశోధన చేశారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, సీడీసీ డీన్ కె.శ్రీరమేష్, తెలుగుశాఖ అధ్యాపకులు తలారి వాసు, టి.సత్యనారాయణ, డి.లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

జీవో నెం.85పై పునరాలోచించాలి

● ప్రభుత్వ వైద్యుల సంఘం వినతి

రాజమహేంద్రవరం రూరల్ జూలై 30: ప్రభుత్వ వైద్యుల పీజీ ప్రవేశం కోసం తెచ్చిన ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.85 పై ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతూ ప్రభుత్వ వైద్యుల సంఘం మంగళవారం జిల్లా వైద్యాధికారి వెంటేశ్వరరావుకు, జిల్లా డీసీహెచ్ఎస్‌లకు వినతి పత్రం అందజేశారు. జీవో 85ను వెనక్కి తీసుకొని ఇన్‌సర్వీస్ కోటాను మునుపటి లాగానే ఉంచాలని వినతి పత్రంలలో కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మౌనిక ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

అనపర్తి, జులై 30 : అపార్ట్‌మెంట్లు, షాపుల వద్ద ప్రతి చోటా సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలను కొంతమేర నిరోధించవచ్చని ప్రతిఒక్కరూ అవగాహన చేసుకోవాలని ఎస్ఐ రామారావు అన్నారు. మంగళవారం అనపర్తిలోని సింధు టవర్స్‌లోని నివాసితులతో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అదేవిధంగా సీసీ కెమేరాల ఏర్పాటు వాటివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రజలు కూడా దొంగతనాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆపద సమయంలో పోలీసులకు సమాచారం అందిస్తే తగిన సహాయం అందించే వీలు ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సింధు టవర్స్ నివాసితులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ క్యాంప్ విజయవంతం చేయండి

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అనపర్తి ప్రాంతీయ ఆసుపత్రిలో వైద్యులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జులై 30: అనపర్తి మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక సభ్యుడు నల్లమిల్లి మూలారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా బిక్కవోలు మండలం బల భద్రపురం గ్రామంలోని ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరం విజయవంతం కావడానికి వైద్యులు, వైద్యాధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం అనపర్తిలోని ప్రాంతీయ ఆసుపత్రిలో ఆయన నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్యులు, వైద్యాధికారులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా వైద్య శిబిరంలో 14రకాల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని అదేవిధంగా కేన్సర్ రోగులకు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తామని తెలిపారు. మెగా రక్తదాన శిబిరం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వచ్చే రోగులకు బస్సు సౌకర్యాలతోపాటు భోజన సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. వివిధ రకాల రోగాలతో బాధపడుతున్న వారి వివరాలు ఇప్పటికే ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల వద్ద ఉంటాయని వీరంతా రోగులను వైద్య శిబిరానికి వచ్చే విధంగా ప్రోత్సహించాలని కోరారు. ఈ శిబిరంలో దంత వైద్యశిబిరం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని మూడురోజుల పాటు శిబిరం నిర్వహించి నెలరోజులపాటు వివిధ చికిత్సలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జీఎస్ఎల్ ఆసుపత్రి అనపర్తి ఐఎంఏ సహాయంతో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రిలో వివిధ కారణాలతో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వైద్య సేవలు అందుతున్న విదానాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి, ఆసుపత్రి వైద్యులు, పలు పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఎన్డీయే నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ పైడిమాంబ జాతర

రాజమహేంద్రవరం కల్చరల్ 30: కంబాల చెరువు వద్ద వేంచేసియున్న విజయ పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త చెల్లుబోయిన అప్పారావు ఆధ్వర్యంలో గరగ నృత్యాలు,మేళతాళాలతో అమ్మవారి సంబరం నిర్వహించారు.భక్తులు తరలి వచ్చి అమ్మవారిని మొక్కుకుని ఆశీస్సులు పొందారు.ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది లేకుండా చూశారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టండి: కమిషనర్



నగరంలో పారిశుధ్యపరిస్థితిని పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గర్గ్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30: రాజమహేంద్రవరంలో పారిశుధ్యనిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిషనర్ కేతన్ గర్గ్ సూచించారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన పలు డ్రైనేజీలు, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలు పరిశీలించారు. నగరంలో రెండు రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి డ్రైనేజీల్లో సిల్ట్, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను పూర్తిస్థాయిలో తొలగించాలన్నారు. చెత్త పేరుకుపోయిన ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వాలన్నారు. నగరంలో చిరువ్యాపారులు ప్లాస్టిక్ డస్ట్‌బిన్నులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరు నిబంధనలు అతిక్రమించినా జరిమానాలు విధించాలని ఆదేశించారు. కోటిలింగాలపేటలో నగరపాలక సంస్థ అందిస్తున్న మంచినీటిలో క్లోరిన్ శాతాన్ని పరిశీలించారు.ఆర్‌టీసీ కాంప్లెక్స్ , రైల్వేస్టేషన్ ప్రాంతాలను పరిశీలించి పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ జి.పాండురంగారావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఉష లీగ్ పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థినికి సిల్వర్ మెడల్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 30 : కర్నాటకలో జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ ఉష లీగ్ (సౌత్‌జోన్) పోటీల్లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థిని కొత్తల పూజిత శృతి సిల్వర్‌మెడల్ సాధించింది. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే సిల్వర్ మెడల్ సాధించిన పూజిత శృతిని అభినందించారు. కళాశాల క్రీడల విభాగాధిపతి ఎం.ప్రసాద్, అకడమిక్ కోఆర్డినేటర్ డి.సంజీవ్ కుమార్, ఎన్ఆర్‌సీ కోఆర్డినేటర్ సీహెచ్ సంజీవ్‌కుమార్, పీడీ విజయదుర్గ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సంచుల నియంత్రణపై అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 30 : పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగం నిషేధించాలని, వీటికి బదులుగా క్లాత్ బ్యాగులను వాడాలని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే అన్నారు. కళాశాల జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు రాజమహేంద్రవరంలోని వివిధ దుకాణాలకు వెళ్లి ప్లాస్టిక్ వినియోగం అరికట్టాలన్నారు. సమన్వయకర్త బి.మల్లికార్జున్, ప్రోగ్రాం ఆఫీసర్ బి.భవానీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఫీజు సాయం

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 30: వెంకటేశ్వర నగర్ జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థికి సాయం అందించారు. సీనియర్ ఇంటర్ చదువుచున్న బి.చంద్రమౌళికి కాలేజి ఫీజునిమిత్తం రూ.65 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఉండవల్లి సత్యనా రాయణ,సెక్రటరీ మూర్తి, ఉపాధ్యక్షుడు వాసు,ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కీర్తి, ఎం.ఎస్.ఎన్‌రాజు,ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ రిటైర్డ్ ఎంప్లాయీస్ సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 30: లాలాచెరువు ఏపీహెచ్‌బి కాలనీలో మంగళవారం ఏపీ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం జరిగింది. అధ్యక్షులు పళ్ళ సత్యనారాయణ,సెక్రెటరీ అద్దంకి సుబ్బారావు,ట్రెజరర్ సత్యప్రసాదరావు, ఈసీ సభ్యులు సోమేశ్వరరావు రిటైర్డ్ ఎంప్లాయీస్ సమస్యలను సభ్యులకు వివరించారు. సభ ఏకగ్రీవంగా ఆమోదించిన డిమాండ్లను ప్రభుత్వానికి త్వరలో నివేదిస్తామన్నారు.

శ్రీవాణి ట్రస్ట్ చెక్కుల అందజేత



:శ్రీవాణి ట్రస్ట్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం/కోరుకొండ, జూలై 30: టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవేంకటేశ్వర ఆలయనిర్మాణ ట్రస్టు ((శ్రీవాణి)ద్వారా ఆలయాల నిర్మాణం, పలు ఆలయాల జీర్ణోద్ధరణకు చెక్కులను రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మంగళవారం ఆలయకమిటీ సభ్యులకు అందజేశారు. రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నం గ్రామంలోని సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయానికి రూ.3,67,000, సంపత్‌నగరంలోని శ్రీమహావిష్ణువు ఆలయానికి రూ.3,05,000లు, తూర్పుగోనగూడెంలోని వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి రూ.5,00, 000లు అందజేశారు. కోరుకొండ మండలం కాపవరం గ్రామంలో మాతృశ్రీ పాశాలమ్మతల్లివారి ఆలయానికి 3,33,000ల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్.డి.ఏ. నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో తల్లిదండ్రులు అన్ని విషయాలు చర్చించాలి

దివాన్‌చెరువు, జూలై 30: పిల్లలతో తల్లిదండ్రులు అన్ని విషయాలను చర్చించాలని, అప్పుడే వారు తల్లిదండ్రులతో ప్రతీవిషయం గురించి మాట్లాడతారని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. జి.వి.నగర్‌లో ఉచిత మగ్గం వర్క్ శిక్షణ ముగించుకున్న 40 మంది మహిళలకు దివాన్‌చెరువులో ఫౌండేషన్ కార్యాలయంవద్ద మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, వీరస్వామి, వినీల తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 31 జూలై 2024 | 5



తగ్గని వరద జోరు : రాజమహేంద్రవరం రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద గోదావరి ఉధృతి

- వివరాలు 8లో

గోదారెటు!



గోష్పాదక్షేత్రంలో మిగిలిన బురద

- తగ్గుతూ.. పెరుగుతున్న గోదావరి
- ధవళేశ్వరం వద్ద తగ్గని ఉధృతి
- కొనసాగుతున్న మొదటి హెచ్చరిక
- భద్రాచలం వద్ద మళ్లీ పెరుగుదల
- ఘాట్లలో పేరుకుపోయిన బురద

రాజమహేంద్రవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు : వరద వదల్లేదు.. ఇంకా కొనసాగుతూనే ఉంది. పైకి తగ్గినట్టు కనిపిస్తున్నా ప్రవాహ ఉధృతి మాత్రం అలాగే ఉంది. నదీ పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గత 12 రోజులుగా అఖండ గోదావరి ఉప్పొంగి ప్రవహించింది. రికార్డు స్థాయిలో వరద పోటెత్తడంతో ఏటిగట్లను తాకుతూ ఎప్పుడు ఊర్లపై విరుచుకు పడదామా అన్నట్టు తీర ప్రాంత ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికి క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టాల మెట్లపై గోదావరి ఉధృతంగా సుడులు తిరుగుతూ ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. ప్రస్తుతం గోదావరి వరద దోబూచులాడుతోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద తగ్గుతూనే ఉంది.మంగళవారం ఉదయం 6 గంటలకు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. రాత్రి 12 గంటలకు బ్యారేజీ వద్ద నీటిమట్టం 12.50 అడుగులకు చేరింది. ఇది 11.75 అడుగులకు దిగితే మొదటి హెచ్చరిక ఉపసంహరించుకుంటారు. ప్రస్తుతం బ్యారేజీ నుంచి దిగువకు 11,05,869 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.ఇదిలా ఉండగా భద్రాచలం వద్ద స్వల్పంగా పెరుగుదల కనిపిస్తోంది.ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక మాత్రమే కొనసాగుతోంది. వాస్తవానికి సోమవారం రాత్రి వరకూ భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గుతూ వచ్చింది. అయితే మంగళవారం ఉదయం 7 గంటలకు ఒక్కసారిగా పదిపాయింట్లు పెరిగి నీటిమట్టం 42.90 అడుగులకు చేరింది.అక్కడ నుంచి నెమ్మదిగా పెరుగుతూ రాత్రి 12 గంటలకు 43.80 అడుగులకు చేరింది. దీంతో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతి కనిపి స్తుంది. ఇదిలా ఉం డగా కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వరద తగ్గుముఖం పట్టడంతో బురదమయమైంది.ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదావరికి వరద తగ్గింది.దీంతో గోష్పదక్షేత్రంలోని ఆలయాలు వరద ప్రవాహం నుంచి బయటపడ్డాయి.వరద ప్రవాహంతో గోష్పదక్షేత్రం అంతా బురదమయంగా మారడంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు. బురదలో ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. బురదను త్వరితగతిన తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

ఏటిగట్లు పటిష్టం చేయాలని సీపీఎం వినతి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 30 : గోదావరి ఏటిగట్లను పటిష్టం చేయాలని సీపీఎం జిల్లా బృందం కలెక్టర్‌ను కోరింది.ఈ మేరకు కలెక్టర్‌కు ఒక వినతిపత్రం అందజేసినట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తెలిపారు. ప్రమాదకరస్థాయిలో గోదావరి ప్రవహిస్తున్న సమయంలో ధవళేశ్వరం నుంచి పురుషోత్తపట్నం మధ్య బలహీనంగా ఉన్న ఏటిగట్లను పటిష్టం చేయాల్సి ఉందని తెలిపారు. ప్రధానంగా కాతేరు, తొర్రేడు, బొబ్బిల్లంక, మునికూడలి, ముగ్గళ్ల, సీతానగరం ప్రాంతాల్లోని గట్లకు ప్రమాదం ఉందని ఇరిగేషన్ అధికారులు గతంలోనే నివేదికలు ఇచ్చారని తెలిపారు. సీతానగరం మండలంలో జరిగిన అక్రమ ఇసుక తవ్వకాల వల్ల నీటి ప్రవాహం తీరుమారి ఏటిగట్లు దెబ్బతిన్నాయని వివరించారు. గతంలో ఏటిగట్లను పటిష్టపరచడానికి ఇరిగేషన్ అధికారులు రూ.60 కోట్ల బడ్జెట్‌తో పనులకు నివేదికలు ఇచ్చారని, కానీ జగన్మోహనరెడ్డి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు జరగలేదని తెలిపారు. మరిన్ని సమస్యలపై కూడా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని పేర్కొన్నారు. సీపీఎం బృందంలో రాజమహేంద్రవరం నగర కార్యదర్శి పవన్, నాయకులు సుందరబాబు, కె.రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

మంత్రిగారొచ్చారు.. సమస్య చూశారు!




కాపవరం వంతెన పరిశీలిస్తున్న మంత్రి

పెరవలి, జూలై 30 : హంగూ లేదూ.. ఆర్భాటం లేదు..ముందస్తు షెడ్యూలు లేదు.. మంత్రి గారు వచ్చేశారు..ఇది విన్న గ్రామస్థులంతా ఆశ్చర్యపోయారు. ఎందుకొచ్చారోనంటూ వెంటనే మంత్రి వద్దకు పరుగులు తీశారు. ఈ సంఘటన మంగళవారం ఉదయం పెరవలి మండలం కాపవరం గ్రామంలో జరిగింది. గతంలో తమ గ్రామం వద్ద గల కాలిబాట వంతెన శిథిలావస్థకు చేరిందని..మరమ్మతులు చేయించాలంటూ గ్రామస్థులు అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయం అధికారులు మంత్రిదృష్టికి తీసుకువచ్చారు.అంతే అప్పటికపుడు బయలుదేరి కాపవరం వచ్చారు.వంతెన అంతా పరిశీలించారు. అయితే గ్రామస్థులు తమకు పెద్ద వంతెన వేయాలని కోరారు. అది రావాలంటే పెద్ద బడ్జెట్ అని ఇరువైపులా రోడ్లు సక్రమంగా ఉండాలని అందువల్ల కాలువ అవతలి వైపు రోడ్డు పనులు ముందుగా చేయాలని అధికారులను ఆదేశించారు.కాపవరం కాలువగట్టు నుంచి తణుకు వెళ్లే పుంత రోడ్డును పక్కా రోడ్డుగా మార్చమని అప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఈ వంతెనకు మరమ్మతులు చేయిస్తామని భవిష్యత్తులో పెద్ద వంతెన విషయమై పరిశీలిస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కాపవరం గ్రామం నుంచి కాలువ అవతల గల పొలాలకు వెళ్లాలన్నా తణుకు తదితర చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లాలన్నా ఈ వంతెన ప్రధాన ఆధారం.



ఇదేం ఇల్లు : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వెలుగుబందలో నిర్మించిన అగ్గిపెట్టె వంటి ఇల్లు

పేదింటి కలత తీరేను!



పేదలకు చంద్రబాబు వరం

- ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు
- గ్రామాల్లో 3 సెంట్లు స్థలం
- పట్టణాల్లో 2 సెంట్లు అందజేత
- కొత్త వారికే వర్తింపు
- మార్చిలో లబ్ధిదారుల గుర్తింపు
- ఏప్రిల్ నుంచి భూ సేకరణ
- గత లబ్ధిదార్లకూ ఆనందం
- ప్రస్తుత ఇళ్లు వేగవంతమే
- వెలుగుబందలో ఇళ్లు నిలిపివేత
- నాణ్యత లోపమే కారణం
- విచారణకు ఆదేశం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కూటమి వరమిచ్చింది.. జిల్లాలోని పేదోడి సొంతింటి కల తీరనుంది..సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పేదలకు తీపికబురు చెప్పింది. పింఛన్ల పంపిణీలో పేదవారి ముఖాన చిరునవ్వు చూసిన కూటమి ప్రభుత్వం తిరిగి అదే ఒరవడి కొనసాగిస్తూ పేదోడి సొంతింటి కల నెరవేర్చేందుకు ముందుకొచ్చింది. రెండు రోజులుగా గృహనిర్మాణ పథకంపై ఉన్నతాధికారులతో సమాలోచనలు జరిపి పేదల గృహనిర్మాణానికి రూ.4 లక్షలు వ్యయం చేసేందుకు నిర్ణయించడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కొక్క లబ్ధిదారుడికి గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు(144 చ.గ), పట్టణ పరిధిలో 2 సెంట్లు(96 చ.గ) చొప్పున ప్రభుత్వం స్థలాలు పంపిణీ చేయడమే గాక ఆ స్థలాల్లో రూ. 4 లక్షల వ్యయంతో ఇళ్ళు నిర్మించనున్నారు. గత ప్రభుత్వంలో స్థల కేటాయింపులు మాత్రమే జరిగి ఇంటి నిర్మాణాలకు నోచుకోని లబ్ధిదారులకు సైతం కొత్త గృహ నిర్మాణ పథకంలో రూ. 4 లక్షలు వెచ్చించి ఇంటి నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మేరకు మార్గదర్శకాలు మరో రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం వెల్లడించనున్నట్టు గృహనిర్మాణ అధికారుల ద్వారా తెలిసింది.దీంతో పేద, మధ్యతరగతి ప్రజల్లో ఆనందం కనిపి స్తోంది.

గత వైసీపీలో అంతా మోసమే..

పేదలందరికీ ఇళ్ళు నిర్మిస్తాం అంటూ అదేదో సొంత జేబులోని సొమ్ముతో కట్టిస్తున్నట్టు కల్లబొల్లి కబుర్లతో కోట్ల మేర నిధులను స్వాహాచేసిన గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాయకులు నివ్వెరపోయే రీతిలో కూటమి ప్రభుత్వం చకచకా అడుగులు ముందుకేస్తుంది. గత వైసీపీ ప్రభు త్వంలో కేవలం ఒక్క సెంటు మాత్రమే.. అవి కూడా పనికిరాని స్థలాలు ఇచ్చి జగనన్న కాలనీలు అంటూ హడా వుడి చేశారు. జిల్లాలో 68,074 ఇళ్లను కట్టిస్తానని.. దాని కోసం 321 లేఅవుట్లు వేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో సెంటున్నర, పట్టణ ప్రాంత లబ్ధిదారులకు సెంటు స్థలం కేటాయించిన సంగతి తెలిసిందే.అది కూడా ఊరికి దూరంగా.. పనికిరాని స్థలాలు కేటాయించారు.పల్లపు ప్రాంతాల్లో లేఅవుట్ వేస్తామని చెప్పి ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాలు కల్పించని సంగతి తెలిసిందే. పైగా ఇంటికి రూ.1 లక్షా 80 వేలే కేటాయించడం వల్ల చాలా మంది పేదలు ఇళ్ల నిర్మా ణానికి ముందుకు రాలేదు. ఏదో విధంగా కట్టుకున్న వాళ్లు అప్పుల పాలయ్యారు. అప్పటి పేదల కాలనీ పేరిట మొదలెట్టిన ఇళ్లు అధ్వానంగా మారి..డొంకలు కూడా పెరిగిన సంగతి తెలిసిందే. అంతేకాదు అర్బన్ ప్రాంతంలో సెంటు భూమిలో ఇల్లు కట్టిస్తానని..పట్టణ ప్రాంతంలోని లబ్ధిదార్లకు గ్రామాల్లో సెంటు కేటాయించి మోసం చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో మొదట 68,074 ఇళ్లు మంజూరయ్యాయని చెప్పి 65,075 ఇళ్లు మంజూరు చేశారు. అందులో 20,899 అసలు ఆరంభమే కాలేదు. కేవలం 24,563 పూర్తి చేసినా అక్కడ జనం నివసించే విధంగా సౌకర్యాలు లేవు. అంతేకాక ప్రజలను నేతలు కూడా మభ్యపెట్టారు. రాజమహేంద్రవరం అర్బన్ లబ్ధిదారులకు వెలుగుబందలో 11,783 స్థలాలు మాత్రమే మంజూరు చేశారు. ఆవభూముల కొనుగోలు చేసి సుమారు 40 వేల మందికి పనికిరాని స్థలాలు పంపిణీ చేశారు. ఈ భూములు నివాసయోగ్యం కావని లబ్ధిదారులు వెనుకంజ వేశారు. దీంతో ఇళ్ల స్థలాలు కేటాయించలేదు.గత వైసీపీ ప్రభుత్వంలో రాజమహేంద్రవరం లబ్ధిదార్లకు స్థలాలు చూపించకుండా కేవలం ఉత్తుత్తి పట్టాలు మాత్రమే పంచారు. ఎన్నికల ముందు ఎంత మంది దరఖాస్తు చేసుకుంటే అందరికీ భూమి లేకుండానే పట్టాలు ఇచ్చేశారు. చివరకు జిల్లాలోని జర్నలిస్ట్ లందరికీ స్థలాలంటూ మోసం చేశారు. ఎద్ద ఎత్తున ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా ఓడిపోయింది.

వచ్చే మార్చి నుంచే అమలు..

టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావ డంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు ఇళ్ల స్థలాల కేటాయింపుపై దృష్టిపెట్టారు. కూటమి అధికారం చేపట్టి 50 రోజులైందో లేదో పేదింటి కల తీర్చే బాధ్యతను భుజాన కెత్తుకున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయడంతో పాటు, కొత్తవారికి స్థలాలు ఇస్తా మని ప్రకటించారు. వచ్చే మార్చిలోపు జిల్లాలోని లబ్ధిదార్లను గుర్తించి,భూమి కూడా సేకరించి, ఏప్రిల్ నుంచి పనులు ఆరంభించనున్నారు.పెండింగ్ బిల్లులు ఈలోపే ఇవ్వనున్నారు. గతంలో వైసీపీ ఆపేసిన లబ్ధిదారులకు కూడా బిల్లులు ఇవ్వనున్నారు.ప్రస్తుతం లేఅవుట్‌లలో అప్పోసప్పో చేసి చిన్న ఇళ్లు మొదలు పెట్టిన వారికి మాత్రం ఉన్న పథకం కిందే పూర్తి చేస్తారు. జర్నలిస్టులు, మధ్యతరగతి ప్రజలకు కూడా మంచి ఇళ్లు నిర్మించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. గత ప్రభుత్వ హయాంలో లబ్ధిపొందినవారు ఇప్పటికే ఇంటి నిర్మా ణాలకు చేసిన అప్పులతో సతమతమవుతుండగా.. కూటమి ప్రభుత్వం రూ.4 లక్షలతో ఇంటినిర్మాణాలు జరుగనుండడంతో డీలాపడుతున్నారు. మరో రెండు మూడు రోజుల్లో కేంద్ర ప్రభుత్వ అనుమతులతో మార్గదర్శకాలు వెలువరించనున్నారు.

కేంద్రం వాటాతో రూ.4 లక్షలు

కేంద్ర ప్రభుత్వం 2024-25 పీఎంఏవై-యు 2.0 పథకంలో భాగంగా కొత్తగా లబ్ధిదారులను ఎంపికచేయనున్నారు. ఇంటి నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ. 2.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ. 1.50 లక్షలు చొప్పున కేటాయించనుంది. ఒక వేళ రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.1.50 లక్షలు పూర్తిగా విడుదల కాకపోతే రూ. 1.20 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం భరించి మిగిలిన రూ.30 వేలు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా విడుదల చేసేందుకు సమాలోచనలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్ళ పథకానికి ఒక్క రూపాయి సొంతంగా (పట్టణాల్లో రూ.30 వేలు మినహా) కేటా యించకుండా ఐదేళ్ల పదవీకాలం పూర్తిచేసింది. ఈ నేపథ్యంలో తాజాగా కేంద్రప్రభుత్వం గృహ నిర్మాణ పథకం మార్గదర్శకాలను పూర్తిగా మార్పులు చేసింది. అంతే కాకుండా గృహ నిర్మాణ లక్ష్యాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని నిర్దేశించడంతో అందుకు కూటమి ప్రభుత్వం కూడా సరేనన్నట్లు సమాచారం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కేంద్ర బృందాలతో రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో సర్వే జరిపించినట్టు తెలిసింది.

వెలుగుబందలో ఇళ్ల నిర్మాణం నిలిపివేత

వెలుగుబందలో గత ప్రభుత్వం 11771 ఇళ్లను మంజూరు చేయగా.. అందులో కొంత మంది సొంతంగా కొంత డబ్బు వేసుకుని ఇళ్లు కట్టుకోవడానికి ముందుకువచ్చారు. 3396 మంది తమకు ఇళ్లు కట్టి ఇవ్వాలని, తాము పెట్టుబడి పెట్టలేమని చెప్పడంతో కొద్దిరోజులు ఇక్కడ పనులు చేపట్టలేదు.ఎన్నికల ముందు ఏడాది హడావిడిగా జెఎన్ఆర్, ఎంఆర్ సంస్థలతో పాటు స్థానికంగా కొందరికి కాంట్రాక్టు ఇచ్చి కేవలం రూ.1.80 లక్షలకే ఇంటిని నిర్మించేటట్టు ఒప్పందం పెట్టుకున్నారు. వీరు కేవలం నిబంధనలు పాటించకుండా అగ్గిపెట్టెలకంటే చిన్నవిగా ఇళ్లు కట్టారు. దీంతో ప్రభుత్వం ఇటీవల విచారణ చేయించింది. లోపాలు గుర్తించడంతో ఈ ఇళ్ల పనులు తక్షణం ఆపేయాలని ఆదేశాలివ్వడం గమనార్హం.

హెల్మెట్ ధరించకపోతే నేరం : పీడీజే

రాజమహేంద్రవరం,జూలై30(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుండా వాహనం నడపడం ప్రమాదకరమే కాకుండా శిక్షార్హమైన నేరమని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత హితవు పలికారు.డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కోర్టు ప్రాం గణం నుంచి లాలాచెరువు వరకూ హెల్మెట్ ధరించడంపై అవగాహన ర్యాలీ చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో హెల్మెట్లను సాధారణ ప్రజలకు ఉచితంగా అందించే కార్యక్రమానికి రూపకల్పన చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే జిల్లాలోని కొన్ని పరిశ్రమలను కోరగా సానుకూలంగా స్పందించాయన్నారు. హెల్మెట్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు చేపడతామని జిల్లా రవాణా అధికారి కేవీ కృష్ణారావు పేర్కొన్నారు.కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు, న్యాయమూర్తులు, డీఆర్‌వో జె.నరసింహులు,అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) రాజశేఖర్‌రాజు పాల్గొన్నారు.



హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న పీడీజే గంధం సునీత, న్యాయమూర్తులు, అధికారులు

బియ్యం దుకాణాలపై కలెక్టర్ కొరడా

విస్తృతంగా తనిఖీలు.. కేసులు నమోదు

'ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రాజమహేంద్రవరం,జూలై30 (ఆంధ్రజ్యోతి): బియ్యం విక్రయ దుకాణాల్లో అవకతవకలపై కలెక్టర్ పి.ప్రశాంతి కొరడా ఝళిపించారు.బియ్యం ధరలు అమాంతం పెరిగిపోవడం,వ్యాపారుల మాయాజాలంపై 'బియ్యమూ వదల్లే- గత ఐదేళ్లు బియ్యం ధరలు దంచుడే'అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై స్పందించారు. తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో పౌర సర ఫరాల శాఖ అసిస్టెంట్ సప్లయిస్ ఆఫీసర్ నాగాంజనేయులు,తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ శామ్యూల్ రాజు రంగంలోకి దిగారు. జాంపేటలోని శ్రీ వెంకటేశ్వర రైస్ స్టోర్స్, సీతం పేటలోని విజయలక్ష్మి రైస్ స్టోర్స్, రామకృష్ణ రైస్ స్టోర్(బాలయ్య బియ్యం కొట్టు),అరిగెల బాబు నాగేంద్ర ప్రసాద్ రైస్ స్టోర్‌లలో తనిఖీలు చేశారు. బస్తాలో 26 కిలోలకు బదులు 25 కిలోలు ఉండడం, తక్కెడలో తేడా, కొన్ని బస్తాలపై ఎంఆర్పీ, తయారీ నెల, 5 కిలోల బియ్యం బస్తాపై ధర లేకపోవడం తదితర అవకత వకలు గుర్తించి కేసులు నమోదు చేశారు.సోదాలు నిరంతరాయం కొన సాగుతాయని అధికారులు తెలిపారు.నిబంధనలు ఉల్లంఘిస్తే కేసుల తప్పవన్నారు.



రాజమహేంద్రవరంలో అన్న కేంటిన్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

ఆగస్టు 15న అన్న కేంటిన్లు ప్రారంభం

రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 30 : పేదవాడి ఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తొలి దశలో ఆగస్టు 15న రాజమహేంద్రవరం సిటీలోని జీజీహెచ్ (ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి), క్వారీమార్కెట్ సెంటర్, మునిసిపల్ కార్యాలయం సమీపంలోని అన్న కేంటీన్లను పునఃప్రారంభించడం జరుగుతుందన్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్ ఆవరణలోని అన్న కేంటీన్ పనులను మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గర్గ్‌తో కలసి పరిశీలించారు. అన్న కేంటీన్ల ద్వారా పేదలకు మూడు పూటలా కేవలం రూ.15లకే నాణ్యమైన ఆహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గర్గ్ మాట్లాడుతూ అన్న కేంటీన్లలో పనులన్నీ రెండు, మూడు రోజుల్లో పూర్తవుతాయని తెలిపారు.



రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూల్చిన జగన్

అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 30 : జగన్మోహనరెడ్డి గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయిందని, రాజధాని నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. రాజమహేంద్రవరం బీజేపీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి సుమారు రూ.50 వేల కోట్ల లబ్ధి చేకూరుస్తూ కేటాయింపులు చేయడం అద్భుతమన్నారు. ప్రతిపక్ష హోదా కోసం న్యాయస్థానాలను ఆశ్రయించే దుస్థితికి జగన్మోహనరెడ్డి పరిస్థితి దిగజారిందన్నారు. అవినీతి, అక్రమాలలకు మాజీ సీఎం జగన్మోహనరెడ్డి కేరాఫ్ అడ్రస్‌గా ఉంటారన్నారు. వైసీపీ కాంగ్రెస్‌లో విలీనం కావడం ఖాయమని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి పాల్గొన్నారు.

సహకార సంఘాలు బలోపేతం చేయాలి

డీసీసీజి సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్ జూలై30: సహకార రంగాన్ని పటిష్ట పరచాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ (డీసీసీబీ) సమావేశంలో మంగళవారం ఆమె మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సహకార సంఘాలు పూర్తి స్థాయిలో చురుకుగా ఉండేలా చూడాలన్నారు. సహకార సంఘాల ఆడిటింగ్, రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలన్నారు. సంఘాల పటిష్టతలో ఉత్పత్తి, మార్కెటింగ్ సామర్థ్యం పెంపు అత్యంత కీలకమైన అంశాలన్నారు. ఈ మేరకు వ్యవసాయ, హార్టీకల్చర్, ఫిషరీస్, మార్కెటింగ్ తదితర విభాగాల ఆధ్వర్యంలో ఏఫ్‌పీవోలు ఏర్పాటు చేయడం ద్వారా సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయవచ్చన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఎన్‌జీవోలను గుర్తించి కనీసం ఏఫ్‌పీవోలో 300 మంది సభ్యులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ జేసీ, డీఆర్‌వో నరసింహులు, జిల్లా సహకార అధికారి శ్రీరాములు నాయుడు, నాబార్డ్ ఎల్‌డీఎం,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఎస్పీ త్వరలో బదిలీ!

జిల్లాకు వచ్చేందుకు ఐదుగురు ప్రయత్నాలు

రాజమహేంద్రవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్(విజిలెన్స్ ఎస్పీ) కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి వారంలో బదిలీ కావొచ్చని తెలుస్తోంది. ఇప్పటికే పి.జగదీశ్, పాపారావు, ప్రసాద్, రాజేంద్ర కుమార్, సుమిత్ కుమార్ గాంధీ పేర్లు డీజీ వద్ద తుది పరిశీలనలో ఉన్నాయని చెబుతున్నారు. ప్రభుత్వం కూడా వీరిలో ఒకరిని నియమించాలని నిర్దేశించడంతో ఈ వారంలో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. జగదీశ్ ఐపీఎస్, సుమిత్ కుమార్ ఐఏఎస్ అధికారులు. వీరిలో జగదీశ్ తూర్పు గోదావరి ఎస్పీగా పని చేసి ఇటీవల బదిలీ అయ్యారు. ప్రస్తుతం డీజీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తూ పోస్టింగ్ కోసం వేచి ఉన్నారు.పాపారావు జిల్లాలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్)గా విధులు నిర్వర్తించి ఏడాది కిందట బదిలీపై సీఐడీకి వెళ్లారు. సుమిత్ కుమార్ గాంధీ రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్‌గా చేశారు. రాజేంద్ర కుమార్ గతంలో ఇదే విభాగంలో రాజమహేంద్రవరంలో డీఎస్పీగా పనిచేశారు. దీంతో ఇక్కడికే ఎస్పీగా రావడానికి గట్టిగా ప్రత్నిస్తున్నట్టు సమాచారం. ఆయనకే అధికశాతం అవకాశం ఉందని అంటున్నారు.

25న అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

రాజమహేంద్రవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి) : జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గ ఎన్నికలు ఆగస్టు 25న తేదీన నిర్వహించనున్నామని.. షెడ్యూల్ 9న విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె సంబంధిత అధికారులతో సమీక్షించారు. పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేయాలని , జూన్ 8వ తేదీలోపు సభ్యులుగా చేరిన వారే ఓటు వేయడానికి అర్హులన్నారు. అప్పటికి మితిమీరిన బకాయిలు ఉన్నవారు అనర్హులేనన్నారు. ఇప్పటికే వాటి వివరాలు బ్యాంక్ బ్రాంచ్‌లలో ప్రదర్శించామని చెప్పారు. జాంపేట మెయిన్ బ్రాంచి కాగా, మోరంపూడి, ధవళేశ్వరం, సీతంపేట, అనపర్తి, పెద్దాపురం, కాకినాడ, గోకవరం, ఏలూరు, కొవ్వూరులలో బ్రాంచిలు ఉన్నాయన్నారు. వచ్చేనెల 9ననోటిఫికేషన్ జారీ అవుతుందని, 16న ఉదయం 11 గంటల నుంచి 5గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారని,అదే రోజు పోటీలో ఉండే అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తారన్నారు 17న స్క్రూట్నీ, 18న ఉపసంహరణ గడువు ఉంటుందని అదే రోజు అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామన్నారు. 25వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ నిర్వహిస్తామని, 26న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తామన్నారు. 27న కొత్త ఛైర్మన్, పాలకవర్గాల భర్తీ ప్రక్రియ ఉంటుందని చెప్పారు.

ప్రశాంతంగా ఏపీపీఎస్సీ శాఖాపరమైన పరీక్షలు

రాజమహేంద్రవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించిన శాఖాపరమైన పరీక్షలు తొలి రోజు మంగళవారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా రెవెన్యూ అధికారి, ఏపీపీ ఎస్సీ జిల్లా నోడల్ అధికారి జి.నరసింహులు తెలిపారు. అయాన్ డిజిటల్ జోన్‌లో జరుగుతున్న పరీక్షల తీరును స్వయంగా పరిశీలించారు. ఉదయం పరీక్షలకు 241 మంది దరఖాస్తు చేసుకోగా 203 మంది, మధ్యాహ్నం పరీక్షలకు 211 మందికిగాను 177 మంది హాజరయ్యారన్నారు. బుధవారం ఉదయం పూట జరిగే పరీక్షకు 577 మంది హాజరు కావాల్సి ఉందన్నారు. ఏపీపీఎస్సీ సభ్యుడు ఎస్.సోనీవుడ్ పరీక్షల నిర్వహణను పరిశీలిస్తారని పేర్కొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



హర్షం వ్యక్తం చేస్తున్న పొగాకు రైతులు

పొగాకు కొనుగోళ్లపై హర్షం

గోపాలపురం, జూలై 30 : పొగాకు రైతులు సాగులో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎన్నికల ముందు ఎంపీ పురందేశ్వరి దృష్టికి తీసుకువెళ్లగా కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ఇచ్చినమాట నిలబెట్టుకున్నారని రైతు నాయకులు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు గద్దే శేషగిరి, రైతు సంఘం గౌరవాధ్యక్షుడు పిన్నమనేని మధుమోహన్ అన్నారు. స్థానిక వేలం కేంద్రంలో పొగాకు రైతులు నాయకులతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ముందు తన దృష్టికి తీసుకువెళ్లిన విషయాన్ని ఆమె ఎంపీ అయిన తరువాత పొగాకు రైతుల సమస్యలను కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ఇతర మంత్రులతో మాట్లాడి అదనపు పంట కొనుగోళ్లపై అపరాధ రుసుము రద్దు చేయించేందుకు కృషి చేశారన్నారు. అపరాధ రుసుము రద్దు చేయడం వలన రైతులకు ఆర్థిక భారం తగ్గిందన్నారు. అదనపు పొగాకు కొనుగోళ్లపై అపరాధ రుసుము రద్దు చేయడానికి కృషిచేసిన కేంద్ర మంత్రికి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి, పొగాకుబోర్డు ఛైర్మన్ హెశ్వంత్‌కుమార్, బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పొగాకు రైతు సంఘం కార్య దర్శి దుగ్గిరాల రాంబాబు రైతులు కూసం మోహన్‌రెడ్డి, ఏవీవీ సత్యనారాయణ, ఎస్.వెంకటరమణ, జె.ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీడీపీవో సుందరికి సత్కారం



సీడీపీవో సుందరిని సత్కరిస్తున్న పీడీ విజయకుమారి,అధికారులు

గోపాలపురం, జూలై 30: విధి నిర్వహణలో సీడీపీవో సుందరి అందరి మన్ననలను పొందారని ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి అన్నారు. స్థానిక కె.ఎస్.రెడ్డి ఫంక్షన్ హాలులో సీడీపీవో సుందరి పదవీ విరమణ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీడీపీవో సుందరి దంపతులను సహోద్యోగులు, కుటుంబ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు శాలువాలు కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. పీడీ విజయకుమారి మాట్లాడుతూ సూపర్‌వైజర్‌గా సీడీపీవోగా 32 ఏళ్లపాటు విధి నిర్వహణలో సేవలు అందించి అందరి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, ఏసీడీపీవో వల్లి, ఏపీసీఈ ఎ. రాజు, సీడీపీవోలు నాగమణి, ఝాన్సీ, లారెన్స్, నరసమ్మ, వరలక్ష్మి, స్వర్ణలత, ఏసీడీపీవో పద్మావతి, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

'సక్రమంగా రేషన్ సరుకులు అందించాలి'



మాట్లాడుతున్న తహశీల్దార్ కృష్ణారావు

నల్లజర్ల, జూలై 30 : ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ డీలర్లు సక్రమంగా ప్రజలకు నిత్యావసర సరుకులు సకాలంలో అందించాలని తహశీల్దార్ కృష్ణారావు అన్నారు. మంగళవారం నల్లజర్ల తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు సమీక్ష సమావేశం ఏర్పాటుచేశారు. ఆగస్టు నెలకు సంబంధించి బియ్యం, గోధుమ పిండి పంపిణీ చేస్తామన్నారు. ప్రతిరోజు ఉదయం 6గంటల నుంచి పంపిణీ కొనసాగించాలని పేర్కొన్నారు. డీలర్లు కందిపప్పు, పంచదారకు డీడీలు కట్టి సిద్ధంగా ఉండాలని కోరారు. సెప్టెంబరు నెలలో కందిపప్పు, పంచదార అందించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షుడు చీమకుర్తి నరసింహమూర్తి, అచ్యుత భాస్కరరావు, నాగు, మహేశ్, కోమలి నాగేశ్వరరావు, బాసింశెట్టి లక్ష్మణరావు, ఎండీయూలు వసంతాడ ఇశ్రాయేలు, సుబ్బారావు, చిడిపి రమేష్, తుమ్మల చంద్రం పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి శాంతి కల్యాణం



సుబ్రహ్మణ్యస్వామి కావిడి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

కొవ్వూరు, జూలై 30 : కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని శ్రీ లలితాపార్వతీ సమేత గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో ఆడి కృత్తికను పురస్కరించుకుని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ పురవీధులలో కావిడి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకుని ఆరు రకాల కావిడిలు, పూజా ద్రవ్యాలతో సేవ, స్వామివారికి పంచామృత అభిషేకాలు, పాశుపత హోమం జరిపించారు. సాయంత్రం సుబ్రహ్మణ్యస్వామి శాంతి కల్యాణం చేపట్టారు. కార్యక్రమంలో పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ



దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొవ్వూరు, జూలై 30: కొవ్వూరు మండలం దొమ్మేరు ఆదరణ అంధుల ఆశ్రమంలో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అంధుల ఆశ్రమం వ్యవస్థాపకుడు అక్కాబత్తుల గోపాలరావు 12వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. గోపాలరావు భార్య సుసన్న, కుమార్తె బేబిసుమ, కుమారుడు సతీష్‌లు ఆశ్రమంలోని 20 మంది దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీచేసి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అక్కాబత్తుల సత్యం, లూధియ, రామచంద్రం, జాన్, నాని, ఇందిర, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



యర్నగూడెం జూనియర్ కాలేజీ
చైర్మన్‌గా గద్దే శ్రీనివాస్

దేవర పల్లి, జూలై 30: యర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజీ చైర్మన్‌గా గద్దే శ్రీనివాస్ ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. యర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల చైర్మన్‌గా యర్నగూడెం గ్రామా నికి చెందిన గద్దే శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన కమిటీ ఎంపిక కళాశాల ప్రిన్సిపాల్ పెన్నేటి చత్రపతి శివాజీ అధ్యక్షతన అధ్యాపకులు, అధ్యపకేతర సిబ్బంది, కళాశాల విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా గద్దే శ్రీనివాస్, ఉపాధ్యాక్షులుగా పెన్నేటి చత్రపతి శివాజీ, ఉపాధ్యక్షురాలిగా పుట్టా వీరమణి, గౌరవాధ్యక్షురాలిగా దుగ్గిరాల వీరసత్యం, సభ్యులుగా తలారి నాగేశ్వరారవు, సుధాకర్, ఏకగ్రీ వంగా ఎన్నికైనట్లు ప్రిన్సిపాల్ శివాజీ తెలిపారు.

ఎస్సీ, బీసీ వసతి గృహాల నిర్మాణానికి కృషి

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూలై 30: కొవ్వూరు పట్టణంలో శిథిలావస్థకు చేరిన ఎస్సీ, బీసీ ప్రభుత్వ వసతిగృహాల నూతన భవన నిర్మాణాలకు కృషిచేస్తానని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణంలో సాంఘిక సంక్షేమ బాలికలు, బాలురు, బీసీ బాలుర వసతి గృహాలను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం సందర్శించారు. వసతిగృహాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన దుప్పట్లు పంపిణీచేసి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ, బీసీ, మైనార్టీలకు చెందిన పిల్లలకు పేదరికం ఎప్పుడూ అడ్డుకారాదని టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వసతి గృహాలను ఏర్పాటుచేశారన్నారు. ఎస్సీ బాలికలు, బాలురు, బీసీ బాలుర వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలు పరిశీలించామన్నారు. వసతిగృహ భవనాలు పడిపోయేవిధంగా ఉన్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రెండు సంవత్సరాలుగా విద్యార్థులకు రావలసిన దుప్పట్లు, కాస్మొటిక్స్ అందించలేదన్నారు. దీంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం విద్యార్థులను అద్దె భవనాల్లోకి మార్పుచేయాలని అధికారులను ఆదేశించారు.

తగ్గుతున్న గోదావరి

● ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
● 12.60 అడుగులకు తగ్గిన నీటిమట్టం ● 11.19 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
● భద్రాచలం వద్ద స్వల్పంగా పెరుగుతున్న వరద

ధవళేశ్వరం, జూలై 30: ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. మంగళవారం ఉదయం ఆరు గంటలకు నీటిమట్టం 13.70అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. గంటకు ఒక్క పాయింటు చొప్పున క్రమంగా తగ్గుతున్న నీటి మట్టం రాత్రి 12 గంటలకు 12.50 అడుగులకు చేరుకోగా 11,05,869 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. బుధవారం నాటికి మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించే స్థాయికి నీటిమట్టం తగ్గవచ్చని అధికారుల అంచనా. ఎగువన తెలంగాణ పరివాహకంలోని లక్ష్మీ బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేయడంతో కాళేశ్వరం వద్ద నీటిమట్టం పెరుగుతోంది. ఆ ప్రభావంతో దిగువన భద్రాచలం వద్ద నీటిమట్టం పెరగడంతో మళ్లీ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మంగళవారం రాత్రి ఏడు గంటలకు నీటిమట్టం 43.80 అడుగులుగా నమోదైంది.



ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉధృతి

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కొవ్వూరు, జూలై 30: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ జుబేర్ మహ్మద్ తెలిపారు. కొవ్వూరు మండలం వేములూరు గ్రామానికి చెందిన కోరాడ దుర్గాప్రసాద్ అవంతీ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. భార్య ఆషాడం కావడంతో పుట్టింటికి వెళ్లింది. ఈనెల 27న రాత్రి ఫ్యాక్టరీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బైక్‌పై బయటకు వచ్చాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుప్రక్కల వెతకగా కొవ్వూరు బస్టాండ్‌లో 4 జతలు బట్టలు బ్యాగ్, ఆధార్, పాన్, బ్యాంకు పాస్‌బుక్, బైక్ పార్క్‌చేసి ఉన్నాయి. సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి ఉందని దుర్గాప్రసాద్ సోదరుడు బాలాజీ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు
రిటైర్డ్ ఉద్యోగి జయరాజు వితరణ

కొవ్వూరు పట్టణంలోని ఎస్సీ బాలికలు, బాలుర వసతిగృహాల విద్యార్థులకు రిటైర్డ్ వసతిగృహ అధికారి పెనుమాక జయరాజు పుస్తకాలు, పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. జయరాజు అందించిన స్టడీ మేటీరియల్‌ను ఎమ్మె ల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే టి.వి.రామారావు, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, ఆర్జిల్లి రామకృష్ణ, డేగల రాము, కొక్కిరిపాటి వెంకటేష్, కౌన్సిలర్ బొండాడ సత్యనారాయణ, మడిచర్ల రామచంద్రరావు, బోడపాటి ముత్యాలరావు, పిక్కి నాగేంద్ర, గంగుమళ్ల స్వామి, బర్ల శ్రీనివాస్, నాళం శ్రీనివాస్, బొంతా శ్యాం రవిప్రకాష్, టిడిపి, జనసేన, బిజేపి నాయకులు, వసతిగృహ అధికారులు ముప్పిడి రాజు, ఆర్.చిరంజీవి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన సచివాలయ కార్యదర్శులు



దుర్గేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి తమ సమస్యలు తెలుపుతున్న సచివాలయ కార్యదర్శులు

పెరవలి, జూలై 30: సచివాలయాలు ఏర్పాటైన అనంతరం గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న తమకు తగిన గుర్తింపు ఇవ్వాలని పలువురు సచివాలయ పంచాయతీ కార్యదర్శులు మంత్రి కందుల దుర్గేష్‌కు నిడదవోలులోని ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా నియామక కమిటీ ద్వారా 2019లో గ్రేడ్ 5 గ్రామ పంచాయతీ గ్రామ సచివాలయం 2,3,4,5లో నియామకం పొందిన తాము సచివాలయంలోని అన్నిశాఖల ఉద్యోగుల సమన్వయంతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. జీవో ఎంఎస్ నెం.11 ద్వారా డీడీవో కార్యదర్శులుగా పంచాయతీ కార్యదర్శికి మాత్రమే అవకాశం కల్పించి గ్రామ సచివాలయంలో పనిచేస్తున్నవారికి డీడీవో అధికారాలు లేకుండా కేవలం పంక్షనరి విధులు నిర్వహించాల్సిందిగా ఆర్డర్‌లో పొందుపరిచారని తెలిపారు. ఒకే రిక్రూట్‌మెంట్ వచ్చిన తమకు కొంతమందికి మాత్రమే అధికారాలు, విధులు కల్పించి మెరిట్‌ర్యాంక్ వచ్చినటువంటి సచివాలయ పంచాయతీ కార్యదర్శులను చిన్నచూపు చూడటం తగదన్నారు. ప్రజలకు అవసరమైన జనన, మరణ ధ్రువపత్రాలు సత్వరమే జారీచేస్తామని వాటిని ధ్రువీకరించే అధికారం తమకు లేనందున వాటి జారీలో ఆలస్యం జరుగుతుందని తాగునీరు, పారిశుధ్య నిర్వహణ విషయంలో కూడా ఎటువంటి అధికారాలు లేనందున తాము పై అధికారులకు తెలియజేయడం తప్ప చేసేదిలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవోఎంఎస్ నెంబరు11ను అనుసరించి మెరిట్‌లిస్టు ప్రాతిపదికన కౌన్సెలింగ్ నిర్వహించి ఒక గ్రామ పంచాయతీకి ఒక కార్యదర్శి ఉండేలా విధులు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

'హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలి'



ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కొవ్వూరు, జూలై 30 : ద్విచక్ర వాహణదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని కొవ్వూరు ఏబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు అన్నారు. ఏపీ హైకోర్టు, రాష్ట్ర లీగల్‌సెల్ అథారిటీ, ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ జాతీయ సేవా పథకం ఆదేశాల ప్రకారం మంగళవారం కొవ్వూరు అల్లూరి బాపినీడు పెండ్యాల రంగారావు డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉన్నత్ భారత్ అభియాన్ వలంటీర్లు కొవ్వూరు, దొమ్మేరు రోడ్‌లో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని నినాదాలు చేస్తూ ద్విచక్ర వాహనదారులను చైతన్య పరిచారు. కళాశాల ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించడం వలన వారి రక్షణతోపాటు కుటుంబం కూడా సురక్షితంగా ఉంటుందన్నారు. యువత బైక్ రైడింగ్ పేరుతో అతివేగంగా వాహనాలు నడపడం వలన ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సత్యనారాయణ, పిల్లి మురళీధర్, ఉన్నత్ భారత్ అభియాన్ కోఆర్డినేటర్లు డాక్టర్ వై.రమేష్, ఎస్.శివన్నారాయణ, అధ్యాపకులు పీఎస్. ప్రవీణ్, జి.గోపాల్, డి.రామలింగేశ్వరరావు, ఎం.మూర్తి, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగుదల

తాళ్లపూడి, జూలై 30 : వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుధ్య కార్యక్ర మాల పట్ల పంచాయతీ అధికారులు దృష్టి సారిస్తున్నారు. తాళ్లపూడి మండలం పోచవరం పంచాయతీవద్ద సర్పంచ్ ఆధ్వర్యంలో దోమల నివారణకు డ్రైనేజీలలో పురుగు మందులు జల్లే కార్యక్రమం చేపట్టారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు తగ్గు ముఖం పట్టడంతో గ్రామంలోని అన్ని వీధులలో నీరు నిలువ ఉన్న ప్రదేశాలలో బ్లీచింగ్ చల్లించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు కార్యదర్శి రామలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.



పోచవరం వీధుల్లో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

'ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి'



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ సూపర్‌వైజర్ పద్మావతి

కొవ్వూరు, జూలై 30 : బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రదానోపాధ్యాయుడు మంగిన శ్రీ రామారావు అన్నారు. కొవ్వూరు మండలం ఐ.పంగిడి జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం సఖీ వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమం పాఠశాల ప్రదానోపాధ్యాయులు మంగిన శ్రీ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కిశోర బాలికలకు బాలల హక్కులు, బాల్య వివాహాలు, బాలల అక్ర మ రవాణా, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రదానోపాధ్యాయులు మంగిన శ్రీ రామారావు మాట్లాడుతూ తల్లిదండ్రులు మగపిల్లలతో పాటు ఆడపిల్లలను సమానంగా చదివించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, మహిళలు, బాలికలకు, గర్భిణులకు ప్రభుత్వాలు అంది స్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కేవీ పద్మావతి, టీచర్‌లు, ఆయాలు, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, జీఎంఎస్‌కెలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'కొవ్వాడ కాలువ ప్రక్షాళన చేయాలి'

గోపాలపురం, జూలై 30: ప్రతిఏటా వర్షాకాలంలో పంట ముంపునకు గురవుతున్న కొవ్వాడ కాలువ ప్రక్షాళన చేయాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్ధార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. కొవ్వాడ కాలువకు సంబంధించిన గట్లను పటిష్ఠం చేయడంతోపాటు ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపు డెక్కను తొలగించి కాలువ లోతును పెంచాలన్నారు. అందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్ధార్ ప్రదీప్, డీటీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంట భూములు



తీపర్రు వద్ద నీట మునిగిన పంట భూములు

పెరవలి, జూలై 30: గోదావరి వరద తగ్గుము ఖం పట్టినప్పటికీ పలు గ్రామాల పరిధిలో పంట భూములు మాత్రం ఇంకా నీటిలోనే నానుతున్నాయి. కానూరు నుంచి మల్లేశ్వరం వరకు సుమా రు పది గ్రామాల ప్రజలు గోదావరి లంక భూములపై ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. కొంత మేర నీటి ప్రవాహం లేనప్పటికీ ఎక్కువ భాగం నీరు ప్రవహించడంతో పలు రకాల పంటలు నీట మునిగాయి. దీంతో పశువుల మేతకు ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోతున్నారు. అరటి వంటి పంటలు ఊటబారిన పడి చనిపోతాయని ఆందోళన చెందుతున్నారు. కొబ్బరి, పామాయిల్‌వంటి వాటికి ఇబ్బందిలేదని చెబుతున్నారు.



కొవ్వూరు మండలం కుమారదేవం ఇసుకర్యాంపు వద్ద నిలిచిన వాహనాలు

కుమారదేవం ఇసుక ర్యాంపు వద్ద
ట్రాఫిక్‌జామ్

● ప్రయాణికుల ఇబ్బందులు

కొవ్వూరు, జూలై 30: కొవ్వూరు, పోలవరం ఏటిగట్టుపై కొవ్వూరు మండలం కుమారదేవం ఇసుకర్యాంపువద్ద భారీగా వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఇసుకర్యాంపుకు వచ్చే లారీలతో మధ్యాహ్నం 3నుంచి 4గంటలవరకు ఏటి గట్టు రోడ్‌పై కిలోమీటరు మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. అటు పోలవరం, మరోవైపు కొవ్వూరువైపు వచ్చే వాహనాలు గంటల కొద్దీ నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇసుక ర్యాంపులవద్ద లారీలను క్రమపద్ధతిలో నిలుపుదల చేయకపోవడంతో కొవ్వూరు, పోలవరం రహదారిలో ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న ఇసుకర్యాంపులో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ట్రాఫిక్‌సుక్రమబద్ధీకరించి వాహనరాకపోకలను పునరుద్ధరించారు.

వెంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధికి
పుంగనూరు గోవులు

దేవరపల్లి, జూలై 30: దేవరపల్లి మండలం యర్నగూడెం అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఎంతో ప్రసిద్ధి చెందిన పుంగనూరు ఆవుదూడలను ఆలయ ధర్మ కర్త కాశీవిశ్వనాధం దైవసేవల నిమిత్తం అంద జేశారు. ఈ సందర్భంగా కాశీవిశ్వనాధం మాట్లాడు తూ హిందువులు దైవరూపంగా భావించి పూజి ంచే గోమాత ఇక నుంచి ఆలయం వద్ద భక్తులచే పూజలు అందుకోనున్నాయని ఆవుదూడలకూ లక్ష్మీ, గోవిందులుగా నామకరణం చేసినట్లు తెలిపారు. దూడ నుదిటిపై పుట్టకతోనే తిరునామం కలిగి ఉండటం విశేషమని ఆయన తెలిపారు.



వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఆవు, దూడలు అందజేసిన ఆలయ ధర్మకర్తలు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి
పంచామృతాభిషేకం



విశేషాలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ఉండ్రాజవరం, జూలై 30: ఉండ్రాజవరం గ్రామంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆషాడమాసం ఆషాడ కృత్తిక నక్షత్రం మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీవారు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

5 వరకు జనసేన సభ్యత్వ నమోదు పొడిగింపు

దేవరపల్లి, జూలై 30: జనసేన సభ్యత్వ నమోదు ఆగస్టు 5వ తేదీ వరకు పొడిగించినట్లు టీడీపీ,జనసేన నాయకులు, కార్యకర్తలు సద్విని యోగం చేసుకోవాలని గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు తెలిపారు. జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదుఈ నెల 21తో ముగిసిందని అధిష్టానం అధికారికంగా ఆగస్టు 5వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. గతంలో సభ్యత్వం తీసుకున్న వారు రెన్యువల్ చేసుకోవాలన్నారు.